http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

గురువారం 7 ఆగస్టు 2025

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## చైనా పర్యటనకు ప్రధాని మోదీ షెడ్యూల్ ఖరారు

- 'గల్వాన్' ఘటన తర్వాత తొలిసారి!
- తియాంజిన్ వేదికగా ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సదస్సులో ఆయన పాల్గొననున్నారు.
- ఈ పర్యటనలో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో మోదీ ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం



## ఉత్తరాఖండ్ జలప్రళయం..

- 28 మంది కేరళ పర్యాటకుల బృందం గల్లంతు
- ఆ బృందంలోని వారిలో 20 మంది మహారాష్ట్రలో స్థిరపడిన వారు
- మిగిలిన 8 మంది కేరళలోని వివిధ జిల్లాలకు చెందిన వారిగా తెలిసింది.



## అందువల్లే మోదీ ట్రంప్ వ్యాఖ్యలకు అడ్డు చెప్పట్లేదు

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- టారిఫ్‌లపై ట్రంప్ పదేపదే బెదిరింపులకు పాల్పడినా మోదీ మౌనంగా ఉండిపోయారు
- రష్యా చమురు ఒప్పందాల ఆర్థిక వ్యవహారాలు బయటపడతాయి

# రాహుల్ గాంధీని ప్రధాని చేస్తాం



- సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు
- బీసీల రిజర్వేషన్ల కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటం చేస్తాం
- కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఇండియా కూటమి మద్దతు ఇస్తుంది
- బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతిని అపాయింట్‌మెంట్ అడిగాం.. కానీ ఇవ్వలేదు
- బీసీ రిజర్వేషన్ల కల్పనలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది

ఢిల్లీ

బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ కాంగ్రెస్ నాయకులు అంత కదం తొక్కారు. ఈ మేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ రిజర్వేషన్ల బిల్లు అమలుకు ధర్నా చేపట్టారు. బీసీ రిజర్వేషన్లు ఇచ్చే వరకు వదలము అని నినదాలు చేశారు. ఈ ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మీడియాతో కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీల రిజర్వేషన్ల కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో బిల్లు ఆమోదింపజేసి.. రాష్ట్రపతికి పంపినట్లు తెలిపారు. ఇంతవరకు రాష్ట్రపతి బిల్లును ఆమోదించలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఇండియా కూటమి మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతిని అపాయింట్‌మెంట్ అడిగాం.. కానీ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల - మిగతా3లో



## ఢిల్లీలో రేవంత్ రెడ్డి అండ్ బ్యాచ్ డ్రామా అట్టర్ ఫ్లాప్

- బీసీ ధర్నాపై హరీశ్‌రావు సెటైర్లు
- ఢిల్లీ వేదికగా నిర్వహించిన దొంగ దీక్షకు.. కూతవేటు దూరంలో ఉండి రాహుల్ గాంధీ రాలేదు
- మాకు బీసీల కన్నా బిహారే ముఖ్యమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాలేదు

హైదరాబాద్

బీసీలకు 42శాతం కోటా పేరిట సీఎం రేవంత్ రెడ్డి అండ్ బ్యాచ్ ఢిల్లీ వెళ్లిన చేసిన డ్రామా అట్టర్ ఫ్లాప్ అయ్యిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఢిల్లీ వేదికగా నిర్వహించిన దొంగ దీక్షకు.. కూతవేటు దూరంలో ఉండి రాహుల్ గాంధీ రాలేదని.. మాకు బీసీల కన్నా బిహారే ముఖ్యమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాలేదని తెలిపారు. - మిగతా3లో



# రాజకీయ పోరాటాల కోసం కోర్టును వాడుకోవద్దు

- ప్రభుత్వ ప్రకటనల్లో ముఖ్యమంత్రి, మాజీ సీఎంలకు సంబంధించిన ఫొటోలు ఉండడం సర్వసాధారణమైన విషయం
- దానిని అనవసర రాద్ధాంతం చేసే ప్రయత్నాలు మానుకోవాలి
- గతంలో తమిళనాడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మద్రాస్ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను, సదరు పిటిషన్‌నూ సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది

2



## ఏఐతో ఉద్యోగాలు పోవు

- ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందనే అంతా ఆందోళన చెందుతున్నారు
- కానీ ఏఐ ప్రస్తుతం జరుగుతున్న పనిని మార్చేసి అందులో నూతనత్వం తీసుకు వస్తుంది
- భవిష్యత్తులో ఏఐ కారణంగా భవిష్యత్తులో మూడు ప్రధాన కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి



## ఎంఎస్ఎంఈ రంగం సమగ్ర ఆర్థిక ప్రగతికి కీలక క్షేత్రం

- మధిర నియోజకవర్గంలో రెండు పారిశ్రామిక పార్కులకు ఆర్థిక సహాయం అందించండి
- ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం
- కేంద్ర మంత్రి జితేంద్ర మాంజిని కలిసి విజ్ఞప్తి చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

న్యూఢిల్లీ

తెలంగాణ రాష్ట్రం ఎంఎస్ఎంఈ (మైక్రో, చిన్న మరియు మధ్యతరః పరిశ్రమల)రంగ అభివృద్ధిలో మరో అడుగు ముందుకు వేస్తోంది, రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రెండు కొత్త ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందనీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రి జితన్ రామ్ మాంజీ కి వివరించారు. బుధవారం ఉదయం ఢిల్లీలో కేంద్ర మంత్రిని డిప్యూటీ సీఎం తో పాటు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ మల్లు రవి , కలిసి విజ్ఞప్తి చేసి లేఖను అందించారు. ఎంఎస్ఎంఈ రంగం సమగ్ర ఆర్థిక ప్రగతికి కీలక క్షేత్రంగా మారుతుందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తరఫున, ఖమ్మం జిల్లా మధిర మండలంలోని యెండపల్లి, ఎర్రుపాలెం మండలంలోని రె మిడిచర్ల గ్రామాల్లో - మిగతా3లో

# సమస్యల సుడిగండంలో గులాబీ దళపతి?



- ఆధిపత్య పోరుతో అన్నా, చెల్లెలు మధ్య ఎవరికి నచ్చ చెప్పలేక, హెచ్చరించలేక సతమతమౌతున్నారు.
- పార్టీ పగ్గాలు వారసునికి అప్పగించి దర్జాగా ఫామ్ హౌస్ నుంచి రాజకీయాలు చేయవచ్చని భావించిన కేసీఆర్ ప్రస్తుతం పార్టీ ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని ఎలా అధిగమించాలి అనే దీర్ఘాలోచనలో పడిపోయారు.
- ఇలాంటి పరిస్థితుల్లో తన వారిని ఏవిధంగా రక్షించుకోవాలని ఆలోచనలు చుట్టుముట్టి ఆయన్ను మరింత క్రుంగదీసేలా చేస్తున్నాయి.

హైదరాబాద్

ఓటమి పాలైన తర్వాత జరిగిన వరుస పరిణామాలు కేసీఆర్ కు పెద్ద తలనొప్పిగా మారాయి. ఓటమి షాక్ లో నుంచి తేరుకునే లోపే ప్రమాదవశాత్తు పడి కాలు విరగడం, తరువాత లిక్కర్ కేసులో కూతురు కవిత జైలు పాలు కావడం, కొడుకు కేటీఆర్ కార్ రేసు కేసులో, తాను, తన మేనల్లుడు హరీష్ రావు కాళేశ్వరం కేసులో విచారణ ఎదుర్కోవాల్సి రావడం ఒక వంతైతే మరోవైపు ఇంట్లో అంతకలహాలు పార్టీలో లుకలుకలు కేసీఆర్ ను కలవరపెడుతున్నాయి. ఆధిపత్య పోరుతో అన్నా, చెల్లెలు మధ్య ఎవరికి నచ్చ చెప్పలేక, హెచ్చరించలేక సతమతమౌతున్నారు. పార్టీ పగ్గాలు వారసునికి అప్పగించి దర్జాగా ఫామ్ హౌస్ నుంచి రాజకీయాలు చేయవచ్చని భావించిన కేసీఆర్ ప్రస్తుతం పార్టీ ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని ఎలా అధిగమించాలి అనే దీర్ఘాలోచనలో పడిపోయారు. తాజాగా కాళేశ్వరం పై వచ్చిన ఘోష్ కమిషన్ విడుదల చేసిన రిపోర్ట్ ఆధారంగా ప్రభుత్వం ఏ విధంగా చర్యలకు ఉపక్రమిస్తుందనే విషయంలో ఎటుపాలుపోని స్థితిలో ఉన్నట్లు - మిగతా3లో



## ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా

- కామారెడ్డి డిక్లరేషన్ కానే కాదు.. ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషన్
- బీసీలకు 5శాతం పెంచి.. ముస్లింలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించే కుట్ర జరుగుతుంది
- బీసీ ముసుగులో ముస్లింలకు 100శాతం రిజర్వేషన్లను అమలు చేసే కుట్ర జరుగుతోంది
- కేంద్రమంత్రి బండి సంజయ్
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తేనే మద్దతిస్తాం

# రాజకీయ పోరాటాల కోసం కోర్టును వాడుకోవద్దు

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ ప్రకటనల్లో ముఖ్యమంత్రి, మాజీ సీఎంలకు సంబంధించిన ఫొటోలు ఉండడం సర్వసాధారణమైన విషయమని, దానిని అనవసర రాద్ధాంతం చేసే ప్రయత్నాలు మానుకోవాలని సుప్రీం కోర్టు బుధవారం వ్యాఖ్యానించింది. ఈ క్రమంలో గతంలో తమిళనాడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మద్రాస్ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను, సదరు పిటిషన్‌నూ సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది.

'స్టాలిన్ విత్ యూ(ఉంగలదాన్' కార్యక్రమం విషయంలో అన్నాడీఎంకేకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ఆ ప్రకటనల్లో సీఎం ఫొటో, పేరు ఉండడంలో ఎలాంటి అభ్యంతరాలు లేవంటూ బుధవారం స్పష్టం చేసింది. గతంలో మద్రాస్ హైకోర్టు తమిళనాడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పును కొట్టేసింది. అలాగే పిటిషనర్ అయిన అన్నాడీఎంకే సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు వీసీ షణ్ముగంకు రూ.10 లక్షల జరిమానా విధిస్తూ మందలించింది.






మద్రాస్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఓ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌ను విచారణ జరిపిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం.. సంక్షేమ పథకాల ప్రచారంలో సీఎం ఫొటో వాడడం తప్పేం కాదని స్పష్టం చేసింది. చాలా రాష్ట్రాల్లో ఇది జరుగుతోందని గుర్తు చేసింది. అలాగే గతంలో అన్నాడీఎంకే ప్రభుత్వం కూడా ఇదే తరహాలో పథకాలను కొనసాగించిన తీరుపైనా ప్రశ్నలు గుప్పించింది. ఈ క్రమంలో పిటిషనర్ అన్నాడీఎంకే నేత అయిన షణ్ముగంను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. బతికి ఉన్న వ్యక్తులతో పాటు మాజీ సీఎంలు, పార్టీ నేతలు, పొలిటికల్ పార్టీల పేర్లను సంక్షేమ పథకాలకు పెట్టొద్దని, అందుకు సంబంధించిన ఫొటోలను కూడా వినియోగించవద్దని గతంలో షణ్ముగం పిటిషన్ ఆధారంగానే మద్రాస్ హైకోర్టు తీర్పు వెల్లడించింది. అయితే సుప్రీం కోర్టు మాత్రం ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది.. "కేవలం ఒక నేతను, ఒక పార్టీనే పిటిషనర్ లక్ష్యంగా చేసుకోవడం వెనుక ఉద్దేశాలు మేం అర్థం చేసుకోగలం. ఒకవేళ రాజకీయ నిధుల దుర్వినియోగంపై గనుక పిటిషనర్ ఆందోళన చెందితే.. ఆ పథకాల విషయంలో ఆయన కోర్టును ఆశ్రయించొచ్చు. కానీ, ఆయన అలా చేయలేదు. పైగా తన అభ్యంతరాలను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లిన మూడు రోజులకే ఆయన హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ పోరాటాల కోసం కోర్టును వాడుకోవద్దు. అందుకే కింది కోర్టులో ఆయన వేసిన పిటిషన్‌నూ(ఇంకా విచారణ దశలో ఉంది కాబట్టి) మేమే కొట్టిపారేస్తున్నాం" అని సీజే బెంచ్ వ్యాఖ్యానించింది. వారం లోగా తాము విధించిన ఈ సొమ్మును ప్రభుత్వానికి జమ చేయాలని షణ్ముగాన్ని.. అదే సమయంలో ఆ సొమ్మును పేద ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని తమిళనాడు ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. ఈ పిటిషన్‌కు సంబంధించిన సుప్రీం కోర్టులో డీఎంకే ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ పీఎస్ రామన్‌తో పాటు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, డాక్టర్ ఏఎం సింఘ్వీలు హాజరయ్యారు. అన్నాడీఎంకే తరఫున సీనియర్ న్యాయవాది మణిందర్ సింగ్ వాదనలు వినిపించారు.

# అందువల్లే మోదీ ట్రంప్ వ్యాఖ్యలకు అడ్డు చెప్పట్లేదు

**ఇంటర్నెట్‌డెస్క్:** భారత్‌పై గణనీయంగా టారిఫ్‌లు పెంచుతానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు దిగిన సంగతి తెలిసిందే. వీటిపై ప్రధాని మోదీ మౌనంగా ఉండటంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ఈసందర్భంగా మోదీ చేతులు కట్టేశారంటూ ఎద్దేవా చేశారు. అమెరికాలో అదానీపై విచారణ జరుగుతుంది కాబట్టి.. టారిఫ్‌లపై ట్రంప్ పదేపదే బెదిరింపులకు పాల్పడినా మోదీ మౌనంగా ఉండిపోయారని రాహుల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ విషయాన్ని దేశ ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. మోదీ, అదానీ, అంబానీలను ఉద్దేశిస్తూ రష్యా చమురు ఒప్పందాల ఆర్థిక వ్యవహారాలు బయటపడతాయని వ్యాఖ్యానించారు. మోదీ చేతులు కట్టేశారంటూ విమర్శించారు. రష్యాతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తుండటంతో భారత్‌పై ట్రంప్ మండిపడుతున్నారు. ఇప్పటికే 25శాతం సుంకాలతో పాటు పెనాల్టీలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈక్రమంలోనే భారత్ మంచి భాగస్వామి కాదంటూ టారిఫ్‌లను గణనీయంగా పెంచుతానని మరోసారి హెచ్చరికలు చేశారు. అయితే, ఆయన వ్యాఖ్యలను భారత్ తిప్పికొట్టింది. అమెరికా కూడా మాస్కో నుంచి దిగుమతులు చేసుకుంటున్న విషయాన్ని గుర్తుచేసింది. రసాయనాలు, ఎరువులు వంటివి కొనుగోలు చేస్తోందని దుయ్యబట్టింది.



అలాంటప్పుడు భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడం అసంబద్ధం అని స్పష్టంచేసింది. మరోవైపు.. ట్రంప్ హెచ్చరికలపై మోదీ స్పందించకపోవడంపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్‌తో మోదీ కౌగిలింతల దౌత్యం కుప్పకూలిందంటూ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

# ఆ ఓటర్ల వివరాలు వెల్లడించండి: ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ:** బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ తర్వాత సుమారు 65 లక్షల మంది ఓటర్లను లిస్టు నుంచి తొలగించిన విషయం తెలిసిందే. అయితే డిలీట్ చేసిన ఆ 65 లక్షల ఓటర్ల వివరాలను వెల్లడించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఇవాళ సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆగస్టు 12 లేదా 13వ తేదీల్లో బీహార్ సిర్ ప్రక్రియపై సుప్రీంకోర్టులో మళ్లీ విచారణ జరగనున్నది. ఈ నేపథ్యంలో తొలగించిన ఓటర్ల వివరాలను బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు చెప్పింది. జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్వల్ భూయాన్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. డిలీట్ చేసిన ఓటర్ల వివరాలను ఇప్పటికే రాజకీయ పార్టీలకు సమర్పించారని, అయితే ఆ వివరాలను బహిరంగంగా వెల్లడించాలని, ఈ కేసులో పిటీషన్ వేసిన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్‌కు కూడా ఓ కాపీని ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. శనివారం లోగా రిప్లై నమోదు చేయాలని, ఏడీఆర్‌కు చెందిన ప్రశాంత్ భూషణ్ దాన్ని పరిశీలిస్తారని, అప్పుడు ఏ విషయాన్ని వెల్లడించాలి, వెల్లడించకూడదో తెలుస్తుందని బెంచ్ తెలిపింది. డిలీటైన 65 లక్షల ఓటర్లు మరణించార లేక శాశ్వతంగా ఇండ్లు మారారా.. అన్న కారణాలు వెల్లడిస్తూ జాబితాను రిలీజ్ చేయాలని ఏడీఆర్ తన




అప్లికేషన్‌లో కోరింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు ఇచ్చింది. డిలీట్ చేసిన లిస్టులో ఉన్న కనీసం 15 మంది బ్రతికి ఉన్నట్లు నిరూపిస్తే, ఈ కేసును తీవ్రంగా పరిగణిస్తామని కోర్టు చెప్పింది.

# ఉచిత బస్సుల్లో చార్జీల వసూలా..?

**సామాజిక మాధ్యమాల్లో ఓ మహిళ పోస్ట్**

**తమిళనాడు ప్రభుత్వం వివరణ**

అన్నానగర్: తమిళనాడు ప్రభుత్వం 'విడియల్ ప్రయాణం' పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా మహిళలు సాధారణ ఛార్జీల సిటీ బస్సులలో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ఈ స్థితిలో మహిళలు ప్రయాణించడానికి ఛార్జీలు లేవని రాసి ఉన్న బస్సు నుంచి డబ్బు తీసుకొని పురుషులకు మహిళలకు టిక్కెట్లు ఇస్తున్నారు. ఇది ఏమిటి? అని ఓ మహిళ తన సోషల్ మీడియా పేజీలో టికెట్‌తో పోస్ట్ చేసింది. తిరుచ్చి నుంచి ముసిరి వరకు పురుషుడికి రూ. 42, ఇద్దరు వ్యక్తులకు రూ. 84 అని అందులో పేర్కొంది. చాలా మంది దీనిని షేర్ చేశారు. కొందరు తమిళనాడు ప్రభుత్వాన్ని కూడా విమర్శించారు. దీని తరువాత, తమిళనాడు ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఈ విషయంలో, తమిళనాడు ప్రభుత్వ అధికారిక సోషల్ మీడియా ఖాతా ఫ్యాక్ట్ చెకింగ్ ఆఫీస్ ఓ పోస్టను పోస్ట్ చేసింది. ఆ ఫోటోలో ఉన్న బస్సు విడియాల్



ట్రావెల్ స్కీమ్ కింద ఉన్న బస్సు కాదు. ఇది తిరుచ్చి నుంచి ముసిరికి వెళ్లే %-%4 సబర్బన్ బస్సు (నీలం రంగు). దీనికి ప్రయాణ రుసుము ఉంది. ఎలక్ట్రానిక్ టికెట్‌లో ప్రయాణికుల వివరాలు స్త్రీ అని కాకుండా పురుషుడు అని పేర్కొంటూ బస్సు కండెక్టర్ పొరపాటున టికెట్ జారీ చేశారని బిజినెస్ పార్టనర్‌షిప్ (సేలం సబర్బన్ బస్) డిప్యూటీ మేనేజర్ తెలిపారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని అని సూచించారు.

## చైనా పర్యటనకు ప్రధాని మోదీ షెడ్యూల్ ఖరారు



**దిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ త్వరలో చైనాలో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. తియాంజిన్ వేదికగా ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సదస్సులో ఆయన పాల్గొననున్నారు. గల్వాన్ ఘటన తర్వాత ప్రధాని మోదీ చైనాలో పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో మోదీ ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది కజాన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అయిన విషయం తెలిసిందే. తొలిసారిగా 2015లో బీజింగ్‌కు వెళ్లిన భారత ప్రధాని.. ఇప్పటివరకు ఐదుసార్లు ఆ దేశంలో పర్యటించారు. 2019లో చివరిసారిగా చైనాలో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరిగ్గా ఇటీవలే కొంత పురోగతి కనిపిస్తోంది. చైనాలో ఈ ఏడాది జూన్‌లో జరిగిన 'షాంఘై సహకార సంస్థ' సభ్యదేశాల రక్షణ మంత్రుల సదస్సులో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం, పహల్గాం ముష్కర దాడులను ప్రస్తావించకపోవడంపై తీవ్రంగా పరిగణించిన భారత్.. ఉమ్మడి ప్రకటనపై సంతకం చేసేందుకు నిరాకరించింది. దీంతో ఎలాంటి ఉమ్మడి ప్రకటన లేకుండానే నాటి చర్చలు ముగిశాయి. అనంతరం జులైలో జరిగిన విదేశాంగ మంత్రుల సదస్సులో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పాల్గొన్న సంగతి తెలిసిందే. మరోవైపు భారత్‌పై సుంకాలు విధించిన ట్రంప్.. రష్యాతో ముడిచమురు కొనుగోలును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విధిస్తామంటూ హెచ్చరిస్తున్నారు. ఇదే సమయంలో రష్యా మాత్రం భారత్‌కు మద్దతుగా నిలుస్తోంది. ఇదే సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ తాజా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.జ

## ఉత్తరాఖండ్ జలప్రళయం..



ఉత్తరాఖండ్ జలప్రళయంతో అక్కడికి వెళ్లిన 28 మంది పర్యాటకుల బృందం గల్లంతైంది. ఆ బృందంలోని వారిలో 20 మంది మహారాష్ట్రలో స్థిరపడిన వారు కాగా, మిగిలిన 8 మంది కేరళలోని వివిధ జిల్లాలకు చెందిన వారిగా తెలిసింది. వారిలో ఓ దంపతులకు చెందిన బంధువు మీడియాతో మాట్లాడుతూ.. తాను వారితో మాట్లాడి ఒకరోజు గడిచిందన్నారు. తాము మాట్లాడినప్పుడు వారు ఉత్తరకాశీ నుంచి ఉదయం 8.30కు గంగోత్రికి బయల్దేరినట్లు వెల్లడించారని ఆయన తెలిపారు. ఆ తర్వాత వారి మార్గంలో కొండచరియలు విరిగిపడ్డాయని, ఆ తర్వాత నుంచి వారితో ఎలాంటి కాంటాక్టు లేదని చెప్పారు. ఫోన్లలో బ్యాటరీ అయిపోయిందా, లేదంటే వారున్నచోట సిగ్నల్ లేదా, మరేదైనా జరిగిందా అనేది అర్థం కావడంలేదని ఆందోళన వ్యక్తంచేశాడు. అతడు చెప్పిన వివరాల ప్రకారం.. హరిద్వార్‌కు చెందిన ఓ ట్రావెల్ ఏజెన్సీ 10 రోజులపాటు ఉత్తరాఖండ్ ట్రిప్ ఏర్పాటు చేసింది. గంగోత్రికి వెళ్లే మార్గంలో ధరాలీ కీలకమైన స్టాప్. అదేసమయంలో మంగళవారం అక్కడ భారీగా మెరుపు వరద విరుచుకుపడింది. క్షణాల్లో భవనాలు మట్టి కింద కూరుకుపోయాయి. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. డజన్ల మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. వారి జాడ కోసం సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది.

## ఏఐతో ఉద్యోగాలు పోవు



**ముంబై :** కృత్రిమ మేధస్సు భవిష్యత్తులో ఉద్యోగాలను కష్టతరం చేస్తుందని చాలా మంది భావిస్తుంటే, ప్రముఖ పారిశ్రామికవేత్త హర్ష్ గోయెంకా మాత్రం దీనిపై భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఏఐ కేవలం ఉద్యోగాలను తీసివేయదని.. బదులుగా పని తీరును పూర్తిగా మెరుగు పరిచి.. సరికొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని తెలిపారు. ఈ విషయమై ఆయన సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఈ మార్పుకు అనుగుణంగా మనం సిద్ధంగా ఉండాలని, నైపుణ్యాలను పెంచుకోవాలని ఆయన యువతకు సూచించారు.ఆర్‌పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష్ గోయెంకా ఎక్స్ వేదికగా చేసిన తన పోస్ట్‌లో.. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందనే అంతా ఆందోళన చెందుతున్నారని గుర్తు చేశారు. కానీ ఏఐ ప్రస్తుతం జరుగుతున్న పనిని మార్చేసి అందులో నూతనత్వం తీసుకు వస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏఐ కారణంగా భవిష్యత్తులో మూడు ప్రధాన కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని స్పష్టం చేశారు. అందులో ఒకటి ప్రాంప్ట్ ఇంజనీర్, రెండోది ఏఐ ప్రొడక్ట్ మేనేజర్, మూడోది ఏఐ ఎథిక్స్ స్పెషలిస్ట్ అని తెలిపారు. అలాగే కార్యాలయాలు నేటిలా కాకుండా వాటి రూపురేఖలే పూర్తిగా మారిపోయే అవకాశం ఉందన్నారు. స్మార్ట్ వర్క్ చేసేవారు వీటిలో బాగా రాణిస్తారని.. అభిప్రాయం వ్యక్తం చేశారు.ప్రస్తుతం గోయెంకా చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్ కావడంతో.. అనేక మంది స్పందిస్తున్నారు. తమ మనసులోని భావాలను కామెంట్ల రూపంలో వెల్లడిస్తున్నారు. చాలా మంది నెటిజన్లు ఏఐ భవిష్యత్తుపై ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక నెటిజన్.. "ఏఐ ఉద్యోగాలను తగ్గిస్తుందని భయపడటం సరికాదు, అది కొత్త మార్గాలను తెరుస్తుంది" అని పేర్కొన్నారు. మరొకరు ఏఐ వల్ల అన్ని రంగాల్లో ఉత్పాదకత పెరుగుతుందని, తద్వారా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెంది కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని అభిప్రాయపడ్డారు.వెంచర్ క్యాపిటలిస్ట్ వినోద్ ఖోస్లా లాంటి ప్రముఖులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఏఐ ట్యూటర్ల రాకతో సాంప్రదాయ కాలేజ్ డిగ్రీలకు ప్రాముఖ్యత తగ్గుతుందని.. వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా విద్య లభిస్తుందని ఆయన అంచనా వేశారు. మొత్తానికి భవిష్యత్ పని ప్రపంచంలో విజయం సాధించాలంటే ఒఎకి అనుగుణంగా మారడం మరియు కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం అత్యంత అవసరం అని ఈ అభిప్రాయాలు స్పష్టం చేస్తున్నాయి.

# సమస్యల సుడిగండంలో గులాబీ దళపతి

-మొదటిపేజీ తరువాయి

కనిపిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ చూపిన దర్పం, ఆర్భాటం ప్రస్తుతం కనిపించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో తన వారిని ఏవిధంగా రక్షించుకోవాలని ఆలోచనలు చుట్టుముట్టి ఆయన్ను మరింత క్రుంగదీసేలా చేస్తున్నాయి. చంద్రబాబుతో విభేదించి తెలంగాణ సాధనే ధ్యేయంగా ఉద్యమాన్ని ఉరకలెత్తించి, రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తెలంగాణ మొదటి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కేసీఆర్, బంగారు తెలంగాణగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు చేసిన ప్రయత్నాలు, వేసిన ప్రణాళికలు, ఆచరించిన వ్యూహాలు ప్రత్యర్థి పార్టీలో నాయకత్వ లేమితో, అభిప్రాయ బేధాలు రెండోసారి తిరిగి ముఖ్యమంత్రి పదవి వరించేందుకు దోహదం చేశాయి. మొదటి ఐదేళ్లు చక్కగా పాలన అందించిన సర్కార్ రెండో టర్మ్ లో ఇష్టానుసారంగా వ్యవహరించడంతో ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది, అదే సమయంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఊహించని రీతిలో అనూహ్య విజయంతో ఒక్కసారిగా కుప్పకూలిన పార్టీని ఏవిధంగా కాపాడుకోవాలనే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అపర చాణక్యుడు, రాజకీయ దురంధరుడు గా పిలువబడే కేసీఆర్ ప్రస్తుత పరిస్థితి అత్యంత దయనీయంగా మారిపోయింది. ఒకవైపు ఇంటిపోరు మరోవైపు పార్టీలో చెలరేగుతున్న ధిక్కారస్వరాలతో ఆయన మదన పడిపోతున్నారు ఒకప్పుడు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం ఏర్పాటుచేసిన ఒక ఉద్యమ పార్టీని ఒంటి చేత్తో నడిపిస్తూ ముందుకు అడుగు ముందుకు వెళ్తూ ఎన్నో జయాపజయాలను మూటగట్టుకుని ఎంతోమంది గొంగళి పురుగులను కౌగిలించుకొని, రాష్ట్ర సాధన ధ్యేయంగా అన్ని పార్టీలతో దాదాపు అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకుని 2010 డిసెంబర్ నవంబర్ 29 నుంచి నవంబర్ 29 ఏకంగా ఆమరణ నిరాహార దీక్షకు పూనుకొని పది రోజులపాటు రాష్ట్రంలో అన్ని వర్గాలను అన్ని పార్టీల నాయకులను ఏకం చేసి ఉద్యమాన్ని తన వైపుకు నిరంతర ఉద్యమ పోరాటంలో అలుపెరుగని నాయకునిగా పేరు పొందారు. రాజకీయాల్లో ఎత్తుకు పైఎత్తు వేసి ప్రత్యర్థినీ ఊపిరిసల్పకుండా చేసే విద్యను ఔపోసన పట్టిన కేసీఆర్ తన్ను చుట్టుముట్టిన సమస్యలను ఎలా అధిగమిస్తారు అనే విషయమై పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.

# కోమటిరెడ్డి బ్రదర్స్ కిం కర్తవ్యం




**నల్గొండ :** సీఎం రేవంత్ రెడ్డి ఏం మాట్లాడినా, దానిని వ్యతిరేకిస్తూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ట్వీట్ చేయడంతో వార్తలకెక్కుతున్నాడు. గతంలో రేవంత్ రెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేసిన రాజగోపాల్ రెడ్డి ప్రస్తుతం ట్వీట్ లు మాత్రమే చేస్తున్నారు. తాజాగా సోషల్ మీడియాపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉటంకిస్తూ కోమటిరెడ్డి బ్రదర్ చేసిన ట్వీట్ మళ్లీ చర్చకు దారితీసింది. దానికి కారణాలు ఏమైనా, రేవంత్ రెడ్డిని విమర్శించేందుకు మాత్రం మంత్రి పదవి ఇవ్వలేదనే కోపమే అని అంటున్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి బీజేపీ లో చేరి ఎన్నికల్లో ఓటమి చవిచూసిన ఆయన తిరిగి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ లో చేరారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో కాంగ్రెస్ లో చేరిన ఆయనకు సమయం అనుకూలించలేదు. పీసీసీ పగ్గాలు రేవంత్ రెడ్డి కి అప్పగించిన తరువాత ఏకంగా అప్పటి ఇంచార్జి కి డబ్బులు ఇచ్చి ఆ పదవి కొనుక్కున్నాడని రేవంత్ పై చేసిన విమర్శ కాంగ్రెస్ పార్టీ లో కలకలం సృష్టించింది. అది మొదలు రేవంత్ రెడ్డిపై విరుచుకు పడడమే పనిగా పెట్టుకొని, ఎన్నికల వరకు రేవంత్ రెడ్డిపై విమర్శల పరంపర కొనసాగించాడు. తానొకటి తలిస్తే దైవం ఒకటి తలచినట్లుగా రేవంత్ రెడ్డి ఆయన చేసిన విమర్శలను పెద్దగా లెక్కచేయలేదు. తన లక్ష్యం వైపు మాత్రమే దూసుకెళ్లాడు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తరువాత సీఎం రేసులో సైతం తాను ఉన్నట్లు రాజ గోపాల్ రెడ్డి ప్రచారం చేసుకున్నారు. అధిష్టానం కూడా తమవైపు చూస్తున్నారని కలలు కన్నాడు. కానీ అందుకు గ్రౌండ్ వర్క్ కూడా చేయని కోమటి బ్రదర్స్ ఆ పదవిని ఆశించడం. తమకు తామే మీడియా లో ప్రొజెక్ట్ చేసుకోవడం వరకే పరిమిత మయ్యారు. కానీ రేవంత్ రెడ్డిని అధిష్టానం ముఖ్యమంత్రిని చేసిన తరువాత ఒక్కసారిగా ఆ మాయ నుంచి బయటికి వచ్చిన కోమటి బ్రదర్స్ తమ స్థానం ఏంటో తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి పదవి ఆశించి భంగపడ్డ రాజగోపాల్ రెడ్డి కనీసం మంత్రి పదవి కూడా సాధించలేకపోవడం, అందుకు ఏవేవో కారణాలు తనకు తానే ఊహించుకొని, అనుచర గణానికి, స్నేహితులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఆయనకు నిత్యం బాకా ఊదే కొన్ని మీడియా సంస్థల ప్రతినిధులు పదేపదే మంత్రి పదవి విషయంలో ఆయన్ను ప్రశ్నించడం, ఆయన ఏదో ఈక్వేషన్లు చెప్పి తప్పించుకోవడం పరిపాటైంది. అధిష్టానంపై విశ్వాసం అంటూనే, రేవంత్ రెడ్డి పై విమర్శలు చేయడం వ్యతిరేక ప్రభావం చూపుతుందని ఆలోచించకోవడంతో ఇంకా ఆయన అనుకున్న లక్ష్యం చేరుకోలేకపోతున్నాడని అర్థమవుతుంది. ఏదో విధంగా ప్రతిదినం వార్తల్లో ఉండాలనే అలవాటుతో ప్రతీ విషయంపై స్పందించడం కూడా ఆయనకు అవకాశాలను దూరం చేస్తున్నాయని తెలుసుకోలేకపోతున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ఏవిధంగా వ్యవహరిస్తున్నారు. పార్టీపై ఎంతవరకు విశ్వాసంలో ఉన్నారు. అధినాయకత్వం విషయంలో ఏ విధంగా వ్యవహరిస్తున్నారు అనే విషయంలో అధిష్టానం దృష్టిసారించినట్లు తెలుస్తోంది. వీటివల్ల పార్టీకి ఎంత లాభం, ఎంతవరకు నష్టం అనే విషయాలపై ఎప్పటికప్పుడు వారి కార్యకలాపాలను అధిష్టానం బేరీజు వేసుకున్నట్లు తెలుస్తోంది. మారుతున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా వారు చేస్తున్న ప్రతీ కామెంట్ ను పరిగణలోకి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మునుగోడు అభివృద్ధి కోసం మళ్లీ పదవి త్యాగానికైనా వెనుకాడనని, అవసరమైతే ఉప ఎన్నిక తెస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం లచ్చమ్మగూడెం చిమిర్యాల గ్రామంలో ఎమ్మె ల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి మాట్లాడుతూ.. 'వేల కోట్లు దోచుకునే వాళ్లకే పెద్ద పదవులు కావాలి, నేను అందరిలాగా పైరవీలు చేసి దోచుకునే వాడిని అయితే కాదు. గత ప్రభుత్వంలో 100 మంది ఎమ్మెల్యేలను మునుగోడు ప్రజల కాళ్లకాడికి తీసుకొచ్చిన చరిత్ర నాది. పదవి కంటే నాకు మునుగోడు ప్రజలే ముఖ్యం. నాకంటే జూనియర్లకు మంత్రి పదవి ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడి, పది సంవత్సరాలు కేసీఆర్ ప్రభుత్వంపై ప్రజల పక్షాన ప్రశ్నించి పదవి త్యాగం చేశా. పదవుల కోసం కాళ్లు పట్టుకునే రకం కాదు. కొందరు మంత్రి పదవి రాలేద ని మాట్లాడుతున్నానని అంటున్నారు. ఒకవేళ పదవి కావాలనుకుంటే ఎల్బీనగర్ నుంచి పోటీ చేసేవాడిని. మునుగోడు ప్రజల అభివృద్ధి కోసమే ఇక్కడి నుంచి పోటీ చేశా. పదవుల కోసం నేను ఎవరి ఇంటికి వెళ్లి బతిమలాడే రకం కాదు. నాకు కావాల్సింది ప్రజలు, వారి సంక్షేమమే. ప్రజలు తలదించుకునే పని ఎప్పటికీ చేయను. రాజగోపాల్‌రెడ్డి మా ఎమ్మెల్యే అని మునుగోడు ప్రజలు గర్వంగా తల ఎత్తుకునేలా వ్యవహరిస్తా' అని వ్యాఖ్యనించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మునుగోడు నియోజకవర్గంలో ఒక్క ఇల్లు, ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. నియోజకవర్గంలో లో-వోల్టేజ్ సమస్యను పరిష్కరించడానికి ఇప్పటికే ఐదు సబ్‌స్టేషన్లు ప్రారంభించామని, మరో పది సబ్‌స్టేషన్ల కోసం ప్రపోజల్స్ పంపించామని ఆయన తెలిపారు. నల్లగొండ జిల్లాలో మునుగోడు చాలా వెనుకబడి ఉన్నదని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత తనపైనా, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంపైనా ఉందన్నారు. ఈ సందర్భంలో మౌనం వహించడం తప్ప గత్యంతరం లేదనే సత్యం తెలుసుకోవాలని ఆయన శ్రేయోభిలాషులు భావిస్తున్నారు.

# రైలు ప్రయాణానికి పెరుగుతున్న డిమాండ్



**హైదరాబాద్ :** రైల్వే.. దేశంలో అతిపెద్ద రవాణా వ్యవస్థ. రోడ్డు మార్గాలు ఉన్నా.. దూరప్రాంత ప్రాయాణాలకు ఎక్కువ మంది ఉపయోగించే రవాణా సాధనం రైలు. పేద, మధ్యతరగతిలోపాటు సంపన్నులు కూడా రైలు ప్రయాణాన్ని సౌకర్యంగా భావిస్తారు. భారత రైల్వే ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. కానీ, ఇప్పటికీ రద్దీకి తగినట్లుగా రైలు సౌకర్యాలు అందుబాటులో లేవు. ఏటా వేలాది మంది ప్రయాణికులు టికెట్ రద్దు చేసుకోవడమే ఇందుకు నిదర్శనం. గడిచిన మూడేళ్లలో 1.09 కోట్ల టికెట్లు రద్దయ్యాయి. దీంతో రైల్వే భారీగా ఆదాయం కోల్పోయింది. ఇందుకు ప్రధాన కారణం రైలు టికెట్ కన్‌ఫామ్ కాకపోవడమే. కొవిడ్ తర్వాత ప్రకృతి, ఆధ్యాత్మిక పర్యాటకం వైపు పెరిగిన ఆసక్తి రైలు ప్రయాణ డిమాండ్‌ను గణనీయంగా పెంచింది. అయితే, వెయిటింగ్ లిస్ట్ సమస్య, టికెట్ కన్ఫర్మేషన్ లేకపోవడం వల్ల ప్రయాణికులు ప్రయాణాలను రద్దు చేసుకోవాల్సి వస్తోంది. ఇంత పెద్ద ఎత్తున టికెట్లు రద్దయ్యాయంటే.. దేశంలో రైళ్ల డిమాండ్ ఏమేరకు ఉందో అర్థమవుతుంది. కొవిడ్ మహమ్మారి తర్వాత ప్రజలు ప్రకృతి పర్యాటక కేంద్రాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలైన తిరుపతి, విశాఖపట్నం, ఢిల్లీ వంటి ప్రాంతాలకు ఎక్కువగా ప్రయాణిస్తున్నారు. విమాన టికెట్ల ధరలు గణనీయంగా పెరగడంతో రైలు ప్రయాణం సరసమైన ఎంపికగా మారింది. అయితే, సికింద్రాబాద్, విజయవాడ, తిరుపతి వంటి ప్రధాన మార్గాల్లో రైళ్ల సంఖ్య డిమాండ్‌ను తట్టుకోలేకపోతోంది. పండగలు, వేసవి సెలవుల సమయంలో సగటున 400?500 సీట్ల వెయిటింగ్ లిస్ట్ సాధారణమైంది. దీంతో చాలామంది బుకింగ్‌కు దూరంగా ఉంటున్నారు. లేదా టికెట్ కన్ఫర్మ్ కాకపోవడంతో ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారు. మూడేళ్లలో దక్షిణ మధ్య రైల్వేలో 1.09 కోటి టికెట్లు రద్దయ్యాయి, సగటున ఏటా 36.3 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణానికి దూరమయ్యారు. ఇందులో 66% (72.13 లక్షలు) స్లీపర్ క్లాస్ టికెట్లు, చైర్‌కార్‌లో 1.15 లక్షలు, సెకండ్ సిటింగ్‌లో 4 లక్షల మంది ఉన్నారు. ఈ రద్దులు టికెట్ కన్ఫర్మేషన్ లేకపోవడం వల్ల సంభవిస్తున్నాయి. వందేభారత్, రాజధాని, దురంతో, శతాబ్ది వంటి వేగవంత రైళ్లు ధర ఎక్కువైనప్పటికీ, వేగం, సౌకర్యం కారణంగా డిమాండ్‌లో ఉన్నాయి. సికింద్రాబాద్?విశాఖపట్నం మార్గంలో రెండు వందేభారత్ రైళ్లు ఉన్నప్పటికీ, టికెట్లు త్వరగా అయిపోతున్నాయి. ఈ రైళ్లు పూర్తిగా ఏసీ బోగీలతో నడుస్తున్నప్పటికీ, సామాన్య ప్రయాణికులకు స్లీపర్, సెకండ్ సిటింగ్ వంటి సరసమైన ఎంపికలు ఎక్కువగా అవసరమవుతున్నాయి. ఈ డిమాండ్‌ను తీర్చడానికి రైల్వే శాఖ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. టికెట్ రద్దుల వల్ల దక్షిణ మధ్య రైల్వే గత మూడేళ్లలో రూ.395.03 కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది. ఈ నష్టం అదనపు బోగీలు లేదా రైళ్లను ఏర్పాటు చేయడం ద్వారా నివారించే అవకాశం ఉంది. రద్దు ఛార్జీల రూపంలో రైల్వే రూ.698 కోట్లు సంపాదించినప్పటికీ, ఇది దీర్ఘకాలిక ఆదాయంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

## రాహుల్ గాంధీని ప్రధాని చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

కల్పనలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ తరహాలో దేశంలోనూ జనగణనలో కులగణన చేయాలని డిమాండ్ చేశారు. తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వొద్దని మోదీ, అమిత్‌షా చెప్పి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

**కేంద్రంపై విమర్శలు..**

బీసీ బిల్లు ఆమోదించకుంటే ప్రధాని మోదీని గద్దె దించుతామని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల కల్పనలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్రానికి బిల్లు పంపి 4 నెలలు అవుతున్నా ఆమోదించడం లేదని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం ధర్నా చేస్తున్నా కేంద్రానికి కనువిప్పు కలగడం లేదన్నారు. బీసీ రిజర్వేషన్లు ఇవ్వకపోతే.. కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధాని చేసి రిజర్వేషన్లు సాధించుకుంటామని ప్రతిఘటించారు. రిజర్వేషన్లు ముస్లింల కోసం కాదు.. బలహీన వర్గాల కోసం ఆయన స్పష్టం చేశారు. ముస్లింల పేరుతో బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోందని రేవంత్ రెడ్డి విమర్శించారు.

## ఢిల్లీలో రేవంత్ రెడ్డి అండ్ బ్యాచ్ డ్రామా అట్టర్ ఫ్లాప్

-మొదటిపేజీ తరువాయి

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన బీసీ ధర్నాపై హరీశ్‌రావు ట్విట్టర్(ఎక్స్) వేదికగా విమర్శలు గుప్పించారు. మీ ధర్నాలో నిజాయితీ లేదని, బీసీలకు 42శాతం కోటా అమలు చేస్తారనే మాటలపై నమ్మకం రాహుల్ గాంధీ, ఖర్గే లతో పాటు, తెలంగాణ ప్రజలకు కూడా లేదని సుస్పష్టం అయ్యిందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. "మేం గుజరాత్ లో అడగలేదు, ఉత్తర్ ప్రదేశ్ లో అడగలేదు, మహారాష్ట్రలో అడగలేదు తెలంగాణలోనే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అడుగుతున్నాం" అని రేవంత్ రెడ్డి ప్రసంగిస్తే.. అదే సమయంలో రాహుల్ గాంధీ గారూ.. "ఈ పోరాటం తెలంగాణ కోసం మాత్రమే కాదు, యావత్ దేశం కోసం చేస్తున్న పోరాటం" అని ట్వీట్ చేస్తరు. ఒకే రోజు, ఒకే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు, రాహుల్ గాంధీ చెప్పిన మాటలకే పొంతన లేదని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ మీద కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో రెండు నాల్కల ధోరణి చూస్తేనే అర్థమవుతున్నదని అన్నారు. మీరు ప్రజలను కొన్నిసార్లు మోసం చేయవచ్చు లేదా కొంతమంది ప్రజలను అన్నిసార్లు మోసం చేయవచ్చు. కానీ అందర్నీ అన్ని సమయాల్లో మోసం చేయలేరు ' అని అబ్రహం లింకన్ చెప్పిన నీతి వాక్యాన్ని ఈ సందర్భంగా హరీశ్‌రావు ప్రస్తావించారు.

## ఎంఎస్ఎంఈ రంగం

## సమగ్ర ఆర్థిక ప్రగతికి కీలక క్షేత్రం

-మొదటిపేజీ తరువాయి

ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాం, వరుసగా 85 ఎకరాలు మరియు 60 ఎకరాల్లో ఈ పార్కులు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు డిప్యూటీ సీఎం కేంద్ర మంత్రికివివరించారు. జాతీయ రహదారి 65 (హైదరాబాద్?విజయవాడ కారిడార్)కు సమీపంలో ఉండటంతో, వీటి భౌగోలిక స్థానం వ్యూహాత్మకంగా ఉంది. సమీప పట్టణాలు, రైల్వే నెట్వర్కు, పోర్టులతో అనుసంధానం ఉందనీ తెలిపారు. ఈ పార్కుల అభివృద్ధి ద్వారా ఆ ప్రాంత యువతకు, ముఖ్యంగా ఎస్సీ వర్గాలకు చెందిన యువతకు పారిశ్రామిక అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఈ పార్కులు వివిధ తయారీ రంగాలకు అనుకూలంగా అభివృద్ధి చేయబడి, కనీసం 5,000 ప్రత్యక్ష మరియు 15,000 పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించగలవనే అంచనాలతో ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం కేంద్ర మంత్రికి వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రతిష్టాత్మక ప్రణాళికను రూపొందించింది. రాష్ట్రంలోని ప్రతి ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలో (మొత్తం 119) చిన్న స్థాయి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలతో కూడిన ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందనీ, ఈ పార్కులు, చిన్న స్థాయి పారిశ్రామిక సంస్థలు తమ వ్యాపారాలను ప్రారంభించి, నడిపించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ అనుకూలమైన పారిశ్రామిక వాతావరణాన్ని అందించనున్నాయి అని కేంద్రమంత్రికి తెలిపారు. ఈ ఎంఎస్ఎంఈ పార్కుల్లో హాస్టళ్లు, కిచెన్లు, టాయిలెట్లు, టెస్టింగ్ సెంటర్లు, ఇతర సాధారణ వసతులు ఉంటాయి. వ్యాపార అభివృద్ధి, ఉత్పత్తి ఆవిష్కరణ, మార్కెట్ వ్యూహం వంటి సేవలు అందుబాటులో ఉంటాయి. మహిళా ప్రాధాన్యత గల సంస్థలకు ప్రోత్సాహంగా స్త్రీనిధి పథకం ద్వారా రుణాల మద్దతు కూడా ఇవ్వనున్నామని కేంద్రమంత్రికి వివరించారు. దీని ద్వారా మహిళల ఆధ్వర్యంలోని సంస్థలు బలోపేతం కావడంతోపాటు, జీవనోపాధి అవకాశాలు విస్తరించనున్నాయి. ప్రస్తుతం ఎంఎస్ఎంఈ-అఆఖ పథకం కింద తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే 25 ప్రాజెక్టులను కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ సహకారంతో అమలు చేస్తోంది. వీటిలో ఇండస్ట్రియల్ పార్కులు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులు, కామన్ ఫెసిలిటీ సెంటర్లు (అఈఅబ) ఉన్నాయి. ఇవి రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ వ్యవస్థను బలంగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ క్రమంలో, తెలంగాణ రాష్ట్రం కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ మద్దతుతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ పార్కులను నెలకొల్పడానికి సంబంధిత పథకాల ద్వారా ఆర్థిక సహాయం కోరుతోంది. ఈ ప్రయోజనాత్మక కార్యక్రమాల ద్వారా భారతదేశం లక్ష్యంగా పెట్టుకున్న 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా తెలంగాణ రాష్ట్రం కీలక భాగస్వామిగా నిలుస్తుందనే నమ్మకాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కేంద్ర మంత్రి ఎదుట వ్యక్తం చేశారు.

## ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా




**హైదరాబాద్:** ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ కానే కాదు.. ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనే అని విమర్శించారు. బీసీలకు 5శాతం పెంచి.. ముస్లింలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించే కుట్ర జరుగుతుందన్నారు. బీసీ ముసుగులో ముస్లింలకు 100శాతం రిజర్వేషన్లను అమలు చేసే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్ధతు కరవైందని ఎద్దేవా చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తేనే మద్దతిస్తామని స్పష్టం చేశారు. బీసీలకు ఏ పార్టీ ఏం చేసిందో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎప్పుడైనా బీసీని ప్రధాని చేశారా అని ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీలో 48 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీనైనా సీఎం చేశారా? చెప్పాలన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో, నామినేటెడ్ పదవులను ఎంతమంది బీసీలకు ఇచ్చారో చర్చిద్దామా అన్నారు. ఎంతమంది బీసీలకు ఎంపీ సీట్లు ఇచ్చారో సమాధానమివ్వగలరా? అని ప్రశ్నించారు. మీరా.. బీసీల గురించి మాకు నీతులు చెప్పేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీని ప్రధాని చేసిన ఘనత భాజపాదేనన్నారు. 27 మంది బీసీ కేంద్ర మంత్రులను, అనేక రాష్ట్రాలకు బీసీ సీఎంలను నియమించిన ఘనత భాజపాకే దక్కుతుందన్నారు. కేంద్రంపై నెపం మోపి బీసీ రిజర్వేషన్ల నుంచి తప్పుకోవాలనుకుంటున్న కాంగ్రెస్.. యూపీ, బెంగాల్, బిహార్ తరహాలో తెలంగాణలోనూ కనుమరుగవడం తథ్యమని హెచ్చరించారు.

# సంపాదకీయం

## నేతన్న చేనేత హస్త నైపుణ్యానికి సలాం

మానవుడి కనీస అవసరాలు కూడు, గూడు, గుడ్డ అని మనకు తెలుసు. వ్యవసాయం తర్వాత అతి పెద్ద పరిశ్రమగా చేనేత హస్తకళలకు గుర్తింపు ఉన్నది. పుట్టిన నాటి నుండి గిట్టే వరకు మన శరీరం మీద వస్త్రాలు తప్పనిసరి. మనం ధరించే వస్త్రాలు మన మానసిక, శారీరక, ఆర్థిక, సామాజిక, వ్యక్తిత్వ గుణాల స్థాయిని రుజువు చేస్తాయి. పంచె కట్టులో పురుషులు, చీర కట్టులో స్త్రీలు అందంగా, హుందాగా, ఆకర్షణీయంగా, సాంప్రదాయం ఉట్టిపడే విధంగా కనుపిస్తారు. నేతన్న చేతుల్లో మాయాజాలం ఫలితంగా సప్తవర్ణ సింగిడి రంగులు వస్త్రాలకు అందాల విందులు ఆరబోస్తాయి. నేతన్న సృజన, దారం పోగును నాట్యం చేయించగల హస్తకళా నైపుణ్యం సదా అభినందనీయం. నాడు విదేశీ వస్త్రాలను బహిష్కరించి, స్వదేశీ చేనేత వస్త్రాలను ప్రోత్సహించడానికి సంకేతంగా గాంధీ గారు నూలు వడికే రాట్నం ముందు కూర్చొని ప్రచారం చేయడం చూసాం. నాటి చేనేత వస్త్రాల నుంచి నేటి ఆధునిక సాంకేతిక యంత్రాల వినియోగం వరకు వస్త్ర పరిశ్రమ ఊహించనంతగా అభివృద్ధి చెందడం చూస్తున్నాం. సిరిసిల్ల నేతన్న వస్త్రాలు, మంగళగిరి చీరలు, బెనారస్ వస్త్ర వెలుగులు, ధర్మవరం ధగధగలు, కోట చీరల కమనీయాలు కలంకారీ కళాకాంతుల వస్త్ర రంగులు నేటికీ మనల్ని మంత్రముగ్ధుల్ని చేస్తూనే ఉన్నాయి. అనాదిగా గ్రామీణ ప్రజానీకానికి జీవనోపాధిని కల్పిస్తున్నది. ఒక దారపు పోగు భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపదకు నిదర్శనంగా నిలుస్తున్నది. దేశ సామాజిక-ఆర్థిక సుస్థిరాభివృద్ధికి చేనేత పరిశ్రమ ఊతం ఇస్తున్నది. స్వతంత్ర భారతంలో చేనేత హస్తకళల ప్రాధాన్యాన్ని అవగాహన పర్చడం, నేతన్నల సమస్యలకు పరిష్కారాలను వెతకడం, మన చేనేతకు అంతర్జాత గుర్తింపుకు ప్రయత్నాలు చేయడం లాంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని 2015 నుంచి భారత కేంద్ర ప్రభుత్వం చొరవతో ప్రతి ఏట 07 ఆగష్టున "జాతీయ చేనేత దినోత్సవం (నేషనల్ హాండ్లూమ్ డే)" పాటించడం జరుగుతున్నది. 07 ఆగష్టు 1905న బెంగాల్ విభజనలను చేసిన బ్రిటీష్ నిర్ణయానికి వ్యతిరేకంగా కలకత్తాలో మొదలైన "స్వదేశీ ఉద్యమం" ప్రారంభానికి గుర్తుగా ఈ దినోత్సవం 07 ఆగష్టున నిర్వహించుకోవడం ముదావహం. నేడు మన చేనేత హస్తకళల పరిశ్రమతో పాటు దాని అనుబంధ రంగాల్లో దాదాపు 70 శాతం మంది మహిళలు శ్రమ చేయడం జరుగుతున్నది. భారత చేనేత పరిశ్రమపై 32 లక్షల కుటుంబాలు ఆధారపడడంతో పాటు 4.33 మిలియన్ల ఉద్యోగ ఉపాధులు కల్పించడం కొనసాగుతున్నది. నేతన్నల ఆదాయాన్ని మెరుగు పరచడంతో పాటు వారిని శక్తివంతులుగా మార్చడానికి వేదికగా ఈ దినోత్సవం ఉపయోగపడుతున్నది. దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలకు చెందిన 125 చేనేత సంస్థలు, 1,246 చేనేత క్లస్టర్లు నేటి జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుతుంటున్నాయి. ఆంధ్రలో 98, తెలంగాణలో 34 క్లస్టర్లు ఉన్నాయి. ప్రపంచ వస్త్ర పరిశ్రమ ఉత్పత్తుల్లో 6.9 శాతం భారతదేశమా ఉత్పత్తి చేస్తున్నది. చైనా మాత్రం 52 శాతానికి పైగా సడవస్త్ర మార్కెట్‌ను కైవసం చేసుకున్నది. చేనేత వస్త్రాల ఉత్పత్తుల్లో 95 శాతం భారతదేశమా అందిస్తున్నది. మన దేశ ఆచారాలు, వారసత్వాలను బట్టి నేతన్న చూపిస్తున్న హస్తకళా నైపుణ్యాల ప్రదర్శన వల్ల చేనేత వస్త్రాలకు ఆదరణ పెరుగుతోంది. నేతన్న కళ్లల్లో సంతోషం వర్షించాలంటే ఆయా కుటుంబాలు ఆర్థికంగా బలపడాలి. నాటి చేనేత పరిశ్రమ తక్కువ పెట్టుబడి, స్వల్ప శక్తి వినియోగం, కాలంతో పాటు వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ డిజైన్లను మార్చడం లాంటివి సానుకూల అంశాలుగా కనిపించేవి. చేనేత వస్త్రాల్లో ప్రధానమైనవిగా కాటన్, సిల్క్, ఉన్ని, ఖాదీ, పట్టు వస్త్రాలు వస్తాయి. నేతన్నకు చవకగా నూలు అందుబాటులో ఉంచడం, పరిశ్రమలు నెలకొల్పడానికి ఆర్థిక గొడుగులు పట్టడం, వస్త్ర ఉత్పత్తుల మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం, ప్రభుత్వాల కనీస బాధ్యత అని తెలుసుకోవాలి. నేతన్న హస్తకళా ఉత్పత్తుల్లో చీరలు, పంచెలు, కాటన్ దుస్తులు, బెడ్ షీట్లు, దుప్పట్లు, శాలువాలు, కండువాలు, కార్పెట్లు, డోర్ మ్యాట్స్, డ్రెస్ మెటీరియల్స్, అంగవస్త్రాలు లాంటివి అనేకం వస్తాయి. ఆత్మనిర్భర్ నినాదంలో భాగంగా "ఓకల్ ఫర్ లోకల్" ప్రచారాన్ని మన ప్రధాని చేపట్టడం హర్షదాయకం. ఒడిసా ఇక్కత్, ఆంధ్ర కళంకారి, గుజరాత్ బంధనీ, యూపీ బ్రెకేడ్స్, తెలంగాణ పోచంపల్లి వస్త్రాలకు మంచి ఆదరణ కనిపిస్తున్నది. చేనేత నూలును ఖాదీ వస్త్రాలుగా, మిల్లులో ఒడికిన నూలును హాండ్లూమ్ ఫ్యాబ్రిక్‌గా ఉత్పత్తి చేయడం కనిపిస్తున్నది. మన మూలాలను వెతుక్కుంటూ, సదాచారాలను పాటిస్తూ, ఆరోగ్యకర చేనేత వస్త్రాలను ధరిస్తూ, నేతన్నకు బాసటగా నిలుస్తూ, అందాన్ని ఇనుమడింపజేస్తున్న నేతన్న వస్త్రాలను ధరిస్తూ , నేతన్న తయారు చేసిన త్రివర్ణ పతాకానికి వందనం చేస్తూ, చేనేత హస్తకళలను కాపాడుతున్న నేతన్నలకు వందనం చేద్దాం, వారి కుటుంబాలకు ఆనందాలను బహుకరిద్దాం.

## విశ్వజనీయ మహాత్ముడు రవీంద్రుడు



జాతీయ గీత సృష్టికర్త, నోబెల్ అవార్డు గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ విశ్వ కవిగా ప్రపంచ వ్యాపిత గుర్తింపు పొందారు. భారత దేశానికి జాతీయ గీతాన్ని అందించిన కవి, రవీంద్ర నాథ్ ఠాగూర్ (మే 7, 1861 %-% ఆగస్టు 7, 1941) తన గీతాంజలి కావ్యానికి సాహిత్యంలో నోబెల్ బహుమతిని అందుకున్నారు. నోబెల్ బహుమతిని అందుకున్న మొట్టమొదటి ఆసియావాసి. వంగదేశంలో 1861 మే 7వ తేదీన శారదాదేవీలకు పద్నాలుగవ సంతానంగా జన్మించిన రవీంద్రనాథ్ ఠాగూర్ చిన్నతనం నుంచే సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. ఇతరులకు భిన్నంగా, రవీంద్రుని బాల్యం గడిచింది. ఆముదం దీపం ముందు పుస్తకం పట్టుకొని కూర్చొని ఆవలిస్తూ కునికిపాట్లు పడుతూ చదివేవారు. నిద్ర లేవగానే ఇంటి తోటలోకి పోయి, ప్రకృతి సౌందర్యాన్ని చూచి ఆనందించే వారు. కథలంటే చెవి కోసు కొనేవారు. సామాన్య దుస్తులతో, నిరాడంబరంగా పెరిగారు. బాల్యంలో ఇంట్లోనే నాలుగు గోడల మధ్య ఉండవలసి రావటంతో, ఆయనకు బయటి ప్రపంచం అద్భుతంగా తోచేది. ప్రపంచమొక రహస్యమనీ, ఆ రహస్యాన్ని తెలుసుకోవాలనీ కుతూహల పడేవారు. రవీంద్రుడు పాఠశాలలో చదవడానికి ఇష్టపడక, ఇంటివద్దనే క్రమశిక్షణతో ప్రతి ఉదయం వ్యాయామం చేసి, లెక్కలు చేసి, చరిత్ర, భూగోళ పాఠాలను, సాయంత్రం చిత్రలేఖనం, ఆటలు, ఇంగ్లీషు అభ్యసించేవారు. ఆదివారాలలో సంగీత పాఠాలు, భౌతిక శాస్త్రం ప్రయోగాలు, సంస్కృత వ్యాకరణం నేర్చుకొనే వారు. బొమ్మలున్న ఆంగ్ల నవలలను స్వయంగా చదివేవారు. కాళిదాసు, షేక్స్పియర్ రచనలు ఇష్టపడి చదివారు. భాషను క్షుణ్ణంగా అభ్యసించి మాతృభాష అభిమానం పెంచుకొన్నారు.ఉన్నత విద్య కోసం ఇంగ్లాండుకు వెళ్లిన రవీంద్రుడు ప్రొఫెసర్ మార్లే ఉపన్యాసాలు విని, ఆంగ్ల సాహిత్యంపై మరింత అభిరుచి పెంచుకున్నారు. సాహితీవేత్తల ప్రసంగాలు విని వారితో సంభాషించి నాటకాలు, సంగీత కచేరీలకు హాజరై, ఆంగ్ల సంస్కృతీ సంప్రదాయాలను ఆకళింప జేసుకున్నారు. అక్కడ తన అనుభవాలను స్నేహితుడు భారతికి లేఖలుగా రాసేవారు. ఇంగ్లండులో ఉండగానే "భగ్న హృదయం" అనే కావ్యాన్ని విశ్వకవి రచించారు. విర్గరేర్ స్వప్న బంగ, సంగీత ప్రభాత అనే భక్తి గీతాలను కూడా రాశారు. ఆయన రచనల్లో గీతాంజలి గొప్పది. బెంగాలీ భాషలో రచించిన భక్తి గీతాలను "గీతాంజలి" పేరుతో ఆంగ్లంలోకి అనువదించారు. అనంతరం దీన్ని అనేక ప్రపంచ భాషలలోకి తర్జుమా చేశారు. ప్రపంచ సాహిత్యంలో ఇది ఓ గొప్ప రచన. మానవుని కృంగదీసే నిరాశ నిస్పృహలు, సకల సృష్టిని ప్రేమభావంతో చూసి శ్రమ గొప్పదనాన్ని సూచించే మహత్తర సందేశం గీతాంజలిలోని ముఖ్యాంశం. ఈ రచనకే 1913 సాహిత్యంలో "నోబెల్ బహుమతి" లభించింది. "విశ్వకవి" అనే బిరుదును సాధించి పెట్టింది. నోబెల్ పొందిన తొలి భారతీయుడి గానే కాదు ఆసియాలోనే తొలి వ్యక్తిగా రికార్డులకు ఎక్కారు. రవీంద్రుడు బాల్యంలోనే అనేక పద్యాలు, వ్యాసాలు, విమర్శలు ప్రచురించారు. ఆయన రచించిన సంధ్యాగీత కావ్యాన్ని కవులందరూ మెచ్చుకొనేవారు. వందేమాతరం గీతాన్ని రచించిన బంకించంద్ర ఛటర్జీ కూడా రవీంద్రుని ప్రశంసించారు. రవీంద్రుడు కేవలం రచయితగానే కాదు, చిన్నారుల హృదయాలను వికసింపజేసే ప్రాచీన గురుకులాల తరహాలోనే "శాంతి నికేతన్"గా ప్రసిద్ధి గాంచిన "విశ్వభారతి విశ్వ విద్యాలయాన్ని" స్థాపించారు. అయిదుగురు విద్యార్థులతో ఆరంభించిన విశ్వభారతి క్రమంగా విస్తరించింది. ఉపాధ్యాయుల ఇళ్లలో విద్యార్థులు భోజనం చేసేవారు. ప్రాతఃకాలంలో నిద్ర లేచి కాలకృత్యాలు తీర్చుకొని, తమ గదులను తామే శు భ్రంచేసి స్నానం చేయడం, ప్రార్థనలు చేయడం, నియమిత వేళలలో నిద్ర పోవడం వారి దినచర్య. ఆరోగ్యం, పరిశుభ్రత, వాక్కు శుద్ధి, పెద్దలను, గురువులను గౌరవించడం ఇక్కడ నేర్పేవారు. 1919లో కళాభవన్ ను స్థాపించి విద్యార్థులకు విభిన్న కళలను నేర్పించేవారు. గ్రామాభ్యుదయమే, దేశాభ్యు దయమని భావించిన రవీంద్రుడు, "శ్రీనికేతాన్ని నెలకొల్పి, గ్రామ పునర్నిర్మాణానికి ఎంతో కృషి చేశారు. మొదట"వాల్మీకి ప్రతిభ" అనే నాటకాన్ని రచించిన విశ్వకవి,"తరువాత" అనే నాటకం రాశారు. రవీంద్రుడి కలం నుంచి జాలువారిన 'చిత్రాంగద నాటకం" ఆయనకు మంచి పేరు తెచ్చింది. "ప్రకృతి... ప్రతీక" అనే నాటకంలో ప్రపంచాన్ని విడిచి పెట్టిన సన్యాసి కథను వర్ణించారు. రవీంద్రుడు "కచదేవయాని, విసర్జన, శరదోత్సవ్, ముక్తధార, నటర్పూజ" మొదలగు అనేక నాటకాలు రచించారు. మతాలు వేరైనా, పరస్పర స్నేహంతో కలసి మెలసి ఉండాలనే సాంఘిక ప్రయోజనం, సందేశ మిళితమైన 'గోరా' నవల రవీంద్రుని కీర్తిని మరింత ఇనుమడింప జేసింది. రవీంద్రుడు మొదటి నుండి జాతీయ భావాలు ఉన్నవారు. హిందీ మేళాలో దేశభక్తి గీతాలను పాడారు. పృథ్వీరాజ్ పరాజయం గురించి ప్రబోధాత్మక పద్యనాటకాన్ని రచించారు. బ్రిటీష్ ప్రభుత్వం తిలక్ ను నిర్బంధించి నపుడు, రవీంద్రుడు తీవ్రంగా విమర్శించారు. బెంగాల్ విభజన ప్రతిఘటనోద్యమంలో రవీంద్రుడు ప్రముఖ వహించారు. జాతీయ నిధికి విరాళాలు. వసూలు చేశారు. రవీంద్రనాథ ఠాగూర్ 1896లో - జరిగిన కలకత్తా కాంగ్రెస్ సదస్సులో మొట్టమొదటిగా బంకించంద్ర చటర్జీ రచించిన "వందేమాతరాన్ని ఆలపించారు". రవీంద్రుడు వ్రాసిన 'జనగణమన 'ను జాతీయ గీతంగా ప్రకటించేముందు "వందేమాతరం "జనగణమన"లో దేనిని జాతీయ గీతంగా ప్రకటించాలని సుదీర్ఘ చర్చ, తర్జన భర్జనలు జరిగాయి. అంతిమంగా రవీంద్రుడి 'జనగణమన'దే పైచేయి అయింది. దీంతో రాజ్యాంగ సభ కమిటీ అధ్యక్షుడు బాబూ రాజేంద్ర ప్రసాద్ 1950 జనవరి 24న జనగణమన జాతీయ గీతంగా, వందేమాతరం జాతీయ గేయంగా ప్రకటించారు.

## భారత హరిత విప్లవ పితామహుడు

భారత వ్యవసాయ రంగాన్ని శాశ్వతంగా మార్చిన మహా మానవుల్లో అగ్రగణ్యుడు డాక్టర్ పూరి వెంకట కృష్ణ స్వామి నాథన్. దేశానికి హరిత విప్లవాన్ని అందించిన శాస్త్రవేత్తగా, రైతుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మార్గదర్శిగా, పౌర హక్కుల పరిరక్షకుడిగా, ఆయన వ్యక్తిత్వం విశ్వ వ్యాప్తి సాధించింది. ఆయన శాస్త్రీయ విజ్ఞానం, దూరదృష్టి, రైతుల పట్ల గల అపారమైన ప్రేమ భారత దేశాన్ని ఆహార దిగుమతి దారుడిగా ఉండే స్థితి నుంచి ఆహార స్వావలంబి దేశంగా తీర్చిదిద్దింది. 1925 ఆగస్టు 7న తమిళనాడులోని తంజావూరు జిల్లాలోని కంబం గ్రామంలో జన్మించిన స్వామినాథన్ పూర్తి పేరు మంకొంబు సాంబశివన్ స్వామినాథన్. తండ్రి ఎం.కే. సాంబశివన్ ప్రఖ్యాత వైద్యుడు. ఆయన ఆశయాన్ని కొనసాగిస్తూ వైద్యవృత్తిలో ప్రవేశించాలన్న ఆలోచన కలిగిన స్వామినాథన్, 1943లో బెంగాల్‌లో సంభవించిన తీవ్ర కరువు దృశ్యాలను చూసి చలించిపోయి, వ్యవసాయ రంగాన్ని తన జీవిత ధ్యేయంగా ఎంచుకున్నారు. మద్రాస్ యూనివర్సిటీలో ప్రాకృత శాస్త్రంలో పట్టభద్రుడైన తరువాత, న్యూఢిల్లీకి చెందిన ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో వ్యవసాయ శాస్త్రంలో స్పెషలైజేషన్ చేశారు. అనంతరం క్యాంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయం, ఆక్స్‌ఫర్డ్‌లో విత్తన శాస్త్రంపై అధ్యయనం కొనసాగించి, నార్మన్ బోర్లాగ్ ప్రభావంతో మెక్సికన్ గోధుమ వంగడాలపై ప్రయోగాలు ప్రారంభించారు. భారతదేశం 1960వ దశకంలో తీవ్రమైన ఆహార కొరతతో బిక్కుబిక్కు మంటున్న వేళ, విదేశాల నుంచి గోధుమల దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటువంటి సమయంలో నార్మన్ బోర్లాగ్ అభివృద్ధి చేసిన పొట్టి గోధుమ జాతులను భారత భూముల కనుగుణంగా మార్చి, దేశ వ్యాప్తంగా అధిక దిగుబడి విత్తనాలను అభివృద్ధి చేసి, రైతులకు అందించడంలో స్వామినాథన్ కీలకపాత్ర పోషించారు. ఇందిరా గాంధీ ప్రభుత్వానికి శాస్త్రీయ సలహాదారుగా వ్యవహరించిన ఆయన సూచనలతో దేశవ్యాప్తంగా హరిత విప్లవం విస్తరించ గలిగింది. గోధుమలతో పాటు బియ్యం, మక్క, జొన్న వంటివి కూడ అధిక దిగుబడిగా పండించ గలగడం వల్ల దేశం ఆహార భద్రత పరంగా స్వయం సమృద్ధిని సాధించింది. వ్యవసాయ ఉత్పాదకత పెరిగినా, అది రైతుల జీవితాల్లో అనుకూల మార్పులు తీసుకు రావలసిన అవసరాన్ని గుర్తించిన స్వామినాథన్, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడంలో పాలకులకు మార్గనిర్దేశం చేశారు. 2004లో ఏర్పడిన రైతులపై జాతీయ సంఘానికి (%చీఞఅశీఝశ్రీ జశీఎఎఱంంఱశీఅ శీఅ ఖీఝతీఎవతీం%) అధ్యక్షత వహించిన ఆయన సూచనల తోనే వెలువడిన నివేదికలు "స్వామినాథన్ కమిషన్" నివేదికలుగా ప్రసిద్ధిపొంది, నేటికీ రైతు ఉద్యమాలకు ఆధారంగా నిలిచాయి. ఆ నివేదికల్లో సూచించిన కనీస మద్దతు ధర (%మీఀూ%) విధానం, రైతుల ఆదాయ భద్రతకు అవసరమైన చట్టపరమైన హామీ, సాగు భూమి పరిమితులు, వ్యవసాయ రుణ భారం, నీటి వనరుల సమగ్ర విధానం వంటి అంశాలు విపరీత ప్రాధాన్యతను సంపాదించాయి. హరిత విప్లవ ఫలితంగా ఉత్పాదకత పెరగడం వలన రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం పెరిగి, పర్యావరణానికి, భూమికి హాని కలుగుతున్నదీ ఆయన ముందుగానే గుర్తించారు. అందుకే 1990లో "సతత హరిత విప్లవం" అనే భావనను ప్రతిపాదించారు. ఇది పర్యావరణ పరిరక్షణతో పాటు నేల ఆరోగ్యాన్ని, నీటి వినియోగ సమర్థతను మెరుగు పరచే విధానాలపై దృష్టి కేంద్రీకరించింది. ఈ సిద్ధాంతంతో వ్యవసాయాన్ని దీర్ఘకాలికంగా సుస్థిరంగా కొనసాగించ వచ్చన్న భావనను ప్రచారంలోకి తెచ్చారు. మద్రాసులో స్థాపించిన ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ గ్రామీణ శాస్త్రీయ పరిజ్ఞాన వికేంద్రీకరణకు, జీవవైవిధ్య పరిరక్షణకు, మహిళల అర్థిక శక్తి వృద్ధికి, పేదల జీవితాలలో ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఎంతో కృషి చేసింది. ఇదే సమయంలో అంతర్జాతీయ స్థాయిలో ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ వంటి సంస్థలకు ఆయన సేవలందించారు. స్వామినాథన్ జీవితంలో అనేక గౌరవాలు వరుసగా వచ్చాయి. పద్మశ్రీ (1967), రామన్ మెగసెసే అవార్డు (1971), పద్మభూషణ్ (1972), పద్మవిభూషణ్ (1989), ప్రపంచ ఆహార బహుమతి ఔశీతీశ్రీం ఖీశీశీ ౯తీఱఓవ తొలి విజేతగా (1987), ఇందిరా గాంధీ శాంతి బహుమతి (1999), ఫోరిన్ అసోసియేట్ ఆఫ్ యుఎస్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వంటి పురస్కారాలు ఆయన సేవలకు గుర్తింపుగా లభించాయి. చివరికి 2024లో భారత ప్రభుత్వం ఆయనకు మరణానంతరంగా అత్యున్నత పౌర పురస్కారం "భారతరత్న"ను ప్రకటించింది. ఇది దేశ వ్యవసాయానికి చేసిన అపూర్వ సేవలకు భారత జనత ఇచ్చిన మహోన్నత కృతజ్ఞత. 2023 సెప్టెంబరు 28న 98 సంవత్సరాల వయస్సులో స్వామినాథన్ మద్రాసులో తుదిశ్వాస విడిచారు. భారత వ్యవసాయ రంగానికి గానే కాక, రైతు జీవితానికి, సమాజానికి, భవిష్యత్ ఆహార భద్రతకు ఆయన చూపిన మార్గం చిరస్మరణీయంగా నిలుస్తుంది. ఆయన నమ్మకం - "వ్యవసాయం అనేది కేవలం ఆహార ఉత్పత్తికి మాత్రమే కాదు, అది జీవన విధానానికి మూలాధారం" అనే సిద్ధాంతం నేటి సమస్యల సమాధానాల్లో వెలుగు చూపిస్తోంది. పూరి వెంకట కృష్ణ స్వామినాథన్ గారు ఒక శతాబ్దపు శాస్త్రవేత్త మాత్రమే కాక, సార్వభౌమ రైతు హక్కుల చైతన్య దాతగా భారత చరిత్రలో అక్షరాల చిరస్థాయిగా నిలిచిపోతారు.

## భారీగా పెరుగుతున్న బంగారం ధరలు

బంగారం ధరలు ఆల్ టైం రికార్డు స్థాయిని తాకిన నేపథ్యంలో బంగారు ఆభరణాల ధరలు కూడా భారీగా పెరిగిపోయాయి. ప్రస్తుతం పెరిగిన ధరలను చూస్తే.. 10 గ్రాముల గోల్డ్ చైన్ కొనుగోలు చేయాలంటే కనీసం లక్ష రూపాయల. బంగారం, వెండి ధరల్లో ప్రతి రోజు హెచ్చుతగ్గులకు లోవుతుంటుంది. ఒక రోజు స్వల్పంగా తగ్గితే మరో రోజు అంతకు రెండు, మూడింతలు పెరుగుతుంది. గతంలో 90 వేల రూపాయల వరకు ఉన్న బంగారం ధరలు.. ఇప్పుడు ఏకంగా లక్ష రూపాయలు దాటేసింది. తగ్గినట్లే తగ్గి భారీగా ఎగబాకుతోంది. తాజాగా ఆగస్టు 6వ తేదీన తులం బంగారం ధర భారీగా పెరిగింది. మంగళవారంతో పోల్చుకుంటే తులం బంగారంపై 900 రూపాయల వరకు పెరిగింది. గత రెండు రోజుల కిందటి ధరను చూస్తే తులంపై ఏకంగా 1500 రూపాయల వరకు పెరిగింది. ఇలా రెండు, మూడు రోజుల దరలను పరిశీలిస్తే తులంపై దాదాపు 3 వేల రూపాయలకుపైగానే పెరిగింది. ఇలా రోజురోజుకు పెరుగుతూపోతే సామాన్యులకు భారంగా మారనుంది. తాజాగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,02230 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.93,710 ఉంది. అదే 18 గ్రాముల ధర 76,680 వద్ద కొనసాగుతోంది. ఈ ధరలు ఉదయం 6 గంటలకు నమోదైనవి మాత్రమే. రోజులో పెరగవచ్చు.. తగ్గవచ్చు.. లేదా స్థిరంగా కొనసాగవచ్చు. ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,0,2380 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 93,860 ఉంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,02230, రూ.93,710 ఉంది. విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,02230, రూ.93,710 ఉంది. ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,02230, రూ.93,710 ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,02230, రూ.93,710 ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,02230, రూ.93,710 వద్ద కొనసాగుతోంది. బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,02230, రూ.93,710 ఉంది.

# మోడల్ స్కూల్ లో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

**అగ్నిధార న్యూస్ శంకరపట్నం :** శంకరపట్నం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కొత్తపల్లి ప్రొపెసర్ జయశంకర్ ( 91) జయంతి సందర్భంగా ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అధ్యక్షులు పాఠశాల ప్రిన్సిపాల్ వి.సరిత జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం జయశంకర్ సార్ చేసిన పోరాటంను స్ఫూర్తిదాయకమని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ప్రభాకర్ ప్రొఫెసర్ జయశంకర్ సార్, తొలి దశ నుండి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు అందించిన సేవలను చారిత్రక ప్రాధాన్యంతో వివరిస్తూ విద్యార్థులలో తెలంగాణ స్ఫూర్తిని నింపారు. అలాగే తెలుగు విభాగం ఉపాధ్యాయులు డా. మహేందర్ ప్రత్యేకంగా రచించిన గీతాన్ని ఆలపించి, జయశంకర్ సేవలను స్మరించుకున్నారు. ఉపాధ్యాయులూ, విద్యార్థులూ కలిసి జోహార్ జయశంకర్ సార్ అనే నినాదాలతో స్కూల్ ప్రాంగణం మారుమోగేలా చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల



ఉపాధ్యాయ రాజు సతీష్ శివశంకర్ రమణారెడ్డి, మధుకర్, సంపత్, ఆర్ రజిత, ఎస్ రజిత ,వనజ, కనక లక్ష్మి, రజని, అనిత, పీఈటీలు మోహన్, తిరుపతి తో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొని ఈ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఉద్యోగులకు యూనిఫాం పంపిణీ చేసిన



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని సివిల్ డిపార్ట్మెంట్ సెక్టార్ టూ నందు పని చేస్తున్న ఉద్యోగులకు సివిల్ డిపార్ట్మెంట్ అధికారులు బుధవారం యూనిఫాం డ్రెస్ మెటీరియల్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ డి.జి.ఎం వరప్రసాద్ మరియు గుర్తింపు సంఘం ఏఐటియుసి డిపార్ట్మెంట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్ లు మాట్లాడుతూ యూనిఫాంని తప్పనిసరిగా ధరించి విధులకు హాజరు కావాలని, క్రమశిక్షణ తో విధులు నిర్వహిస్తూ సివిల్ డిపార్ట్మెంట్ కు మంచి పేరు తేవాలని వారు పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎస్.ఇ.వసంత్ కుమార్, సూపర్వైజర్ యుగంధర్ రెడ్డి, సూపరింటెండెంట్ ప్రవీణ్, వర్క్ ఇన్స్పెక్టర్ పూజారి శ్రీనివాస్ ఏఐటియుసి నాయకులు బిట్టి వెంకటేశ్వర్లు అటికేటి రాజు మేకల లింగయ్య, సమ్మయ్య, సతీష్, మహేష్, మల్చూర్ దోరగండ్ల మల్లయ్య ఇతర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## బీసీలకు 42% రిజర్వేషన్ సాధనకై ఎమ్మెల్యే తో కలిసి ధర్నాలో కాంగ్రెస్ నాయకులు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** బీసీల 42% శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలని కేంద్రాన్ని కోరుతూ టీపీసీసీ ఆధ్వర్యంలో ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో కల్వకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో కలిసి ధర్నాలో పాల్గొన్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ సింగల్ విండో డైరెక్టర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్ట వెంకటయ్య గౌడ్ మాడుగుల సింగల్ విండో డైరెక్టర్ కొప్పుల జగన్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, మాజీ ఎంపీటీసీ, అద్దాల రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెల్దండలో పందుల దొంగతనం ఘర్షణలో బెల్లంకొండ రాములు మృతి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండల కేంద్రంలో బెల్లంకొండ రాములుకు చెందిన పందులు కొంతమంది దొంగతనం చేసి వెల్దండ శివారులో ఒక షెడ్డు ఏర్పాటు చేసుకొని అక్కడ పందులను పెంపకం చేస్తున్నారని సమాచారంతో బెల్లంకొండ రాములు తోపాటు నలుగురు కలిసి అక్కడి వెళ్లి చూడగా అందులో కొన్ని పందులు తనవేనని తెలుసుకుని పెంపకం దారులతో ఘర్షణకు దిగగా దొంగతనం చేసిన వారు రాములు పై కత్తులతో దాడి చేసి అక్కడి నుండి పరారయ్యారు. దాడిలో రాములు మృతిచెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాల పాలైన వారికి కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్దండ పోలీసులు తెలిపారు.

# అప్రకటిత విద్యుత్ కోతలు అల్లాడుతున్న ప్రజలు

**– దోమల బాధకు జాగారం చేస్తున్న జనాలు**



**అగ్నిధార న్యూస్ మంథని :** మంథని పట్టణం,పరిసర గ్రామాలలో గత కొన్ని రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలు ప్రజలను నిద్ర పోనివ్వడం లేదు. పగలు రాత్రి తేడా లేకుండా కరెంటు పోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వర్షాభావంతో ఒకవైపు ఉక్క పోత మరోవైపు దోమల మోత వెరసి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అర్ధరాత్రి అపరాత్రి అనే తేడా లేకుండా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు దోమకారులకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. చిన్నపిల్లలు దోమల కాటుకు గురై విష జ్వరాల పాలవుతున్నారు. మంథని పాత పెట్రోల్ బంక్ నుండి గంగాపురి, కూచి రాజ్ పల్లి, శ్రీ రామ్ నగర్ వరకు రైస్ మిల్లులు ఉండడంతో విద్యుత్ లోడ్ ఎక్కువగా పడి జంపర్లు ట్రిప్ అవుతున్నట్లు తెలియ వచ్చింది. పరిసర గ్రామాలలో చిన్న చినుకులు పడిన పగలు,రాత్రి వేళలు తేడా లేకుండా గంటల తరబడి కోతలతో ప్రజలు అల్లాడి పోతున్నామే అంటూ ముసలవ్వల ముచ్చట్లు వినబడుతున్నాయి. సమస్య పరిష్కారానికి కృషి చేయవలసిన విద్యుత్ అధికారులు సత్వర స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కరెంటు కష్టాలతో వేగలేక పోతున్నామని విమర్శలు సర్వత్ర వినిపిస్తున్నాయి. సముద్రంలోని చేప నీళ్లకు ఏడ్చినట్లు పక్కనే ఎన్టిపిసి ఉన్న మంథని ప్రజలకు కరెంటు అగచాట్లు తప్పడం లేదు. కరెంటు కోతలు నివారణకు సత్వరమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని మంథని పట్టణ,పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు

**అగ్నిధార న్యూస్ మంథని :** తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 91 వ జయంతిని పురస్కరించుకొని మంథని పట్టణంలోని జయశంకర్ విగ్రహానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు సీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షులు మంథని విజయ్ కుమార్ , డివిజన్ అధ్యక్షులు గోగుల రాజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం దేవేందర్ గౌడ్, విద్యార్థి ఉద్యమ నాయకుడు బెజ్జంకి డిగంబర్, మండల ప్రధాన కార్యదర్శి జాడి జంపన్న, సర్వర్ ఉద్యమకారులు పూలమాల లు వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టియుఎఫ్ నాయకులు మాట్లాడుతూ. 1969 నుండి 2011 వరకు తెలంగాణ కోసం నిరంతరం కృషి చేసిన గొప్ప వ్యక్తి జయశంకర్ సార్ అని ఆయన తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన పోరాట యోధుడు అని పేర్కొన్నారు. ఆయనను తెలంగాణ జాతిపితగా ప్రభుత్వం గుర్తించాలని పేర్కొన్నారు. ఈనెల 11వ తేదీ సోమవారం రోజున వరంగల్లోని వేయి స్తంభాల గుడి నుండి ఏకశిలా జయశంకర్ విగ్రహం వరకు తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని టి యు ఎఫ్ ఆధ్వర్యంలో జరిగే పాదయాత్రలో తెలంగాణ ఉద్యమకారులు మంథని నుండి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా ప్రజా యుద్ధనౌక గద్దర్ కు వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తూ గద్దర్ పేరు మీద హైదరాబాద్‌లో కళాభవన్ నిర్మించాలని ఉద్యమకారులు కోరారు.



# ఖని లో ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం)** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయంశంకర్ ముద్దు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక జీఎం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్జి1 జీఎం డి.లలిత్ కుమార్ హాజరై జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ తెలుగు ఉర్దూ హిందీ ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రావీణ్యం ఉందని,తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారన్నారు. నీరు నిధులు నియమాకాలు సాదించుకోవాలని అహర్నిషలు పోరాటం చేసిన మహానుభావుడని తెలిపారు. 1969 తెలంగాణ ఉద్యమంలోనూ అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతోన్న అన్యాయాల పట్ల, అసమానతల పట్ల తీవ్రంగా పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఆంజనేయ ప్రసాద్,పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి సి.ఎం.ఓ.ఐ ప్రతినిధి క్రాంతి కుమార్,ఎఐటియుసి జీఎం ఆఫీస్ ఇంచార్జ్ రాజు,సీనియర్ పిఒ హనుమంత రావు పాల్గొన్నారు.



## వీధి దీపాలు ఏర్పాటు

**– 33 వ డివిజన్ పరుశురాం నగర్ లో వీధి దీపాలను మున్సిపల్ ఎలక్ట్రికల్ సిబ్బందితో మరమ్మత్తులు చేపిస్తున్న మద్దెల దినేష్.**

**– ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన ఏఈ రాంజీ**

**– మున్సిపల్ విద్యుత్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపిన మద్దెల దినేష్ .**



**అగ్నిధార న్యూస్ గోదావరిఖని టౌన్ ఆగష్టు 6** రామగుండం నగరపాలక సంస్థ లోని 33 వ డివిజన్ పరుశురాం నగర్ మెయిన్ రోడ్డు నుండి 5 ఇంక్లైన్ సుమారు 21 వీధిదీపాలు గతంలో మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేయడం జరిగింది. ప్రధాన రహదారి మొత్తం చీకటి మయం కావడంతో స్థానిక ఇండ్ల ప్రజలు మద్దెల దినేష్ దృష్టికి తీసుకురావడంతో ఆయన, రామగుండం మున్సిపల్ విద్యుత్ అధికారి ఏఈ రాంజీ దృష్టికి తీసుకుపోవడంతో వెంటనే స్పందించి సిబ్బందితో వచ్చి వీధిదీపాలు మరమ్మత్తులు చేశారని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ తెలిపారు. దీపాలు మరమ్మత్తుల ద్వారా పట్టణంలోని వీధులు మరింత ప్రకాశవంతంగా మారాయని రాత్రి వేళల్లో ప్రజల భద్రతకు భరోసా ఏర్పడిందన్నారు. అదేవిధంగా రామగుండం నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ స్పందించి వెంటనే పరుశురాం నగర్ నుండి 5 ఇంక్లైన్ చౌరస్తా వరకు ఉన్న 21 వీధి దీపాలుకు ఎల్ ఇ డి స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలి అని, మద్దెల దినేష్ డిమాండ్ చేసారు.

## సివిల్ డిపార్ట్మెంట్ ఉద్యోగులకు యూనిఫాం పంపిణీ



**అగ్నిధార న్యూస్ గోదావరిఖని టౌన్ ఆగష్టు 6** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని సివిల్ డిపార్ట్మెంట్ సెక్టార్ టూ నందు పని చేస్తున్న ఉద్యోగులకు సివిల్ డిపార్ట్మెంట్ అధికారులు బుధవారం యూనిఫాం డ్రెస్ మెటీరియల్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ డి.జి.ఎం వరప్రసాద్ ఎఐటియుసి గుర్తింపు సంఘం కార్యదర్శి దాసరి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ యూనిఫాంని తప్పనిసరిగా ధరించి విధులకు హాజరు కావాలని, క్రమశిక్షణ తో విధులు నిర్వహిస్తూ సివిల్ డిపార్ట్మెంట్ కు మంచి పేరు తేవాలని పేర్కొన్నారు ఇంకా ఈ కార్యక్రమంలో ఎస్.ఇ.వసంత్ కుమార్, సూపర్వైజర్ యుగంధర్ రెడ్డి, సూపరింటెండెంట్ ప్రవీణ్, వర్క్ ఇన్స్పెక్టర్ పూజారి శ్రీనివాస్ ఏఐటియుసి నాయకులు బిట్టి వెంకటేశ్వర్లు అటికేటి రాజు, మేకల లింగయ్య, సమ్మయ్య, సతీష్, మహేష్, మల్చూర్, దోరగండ్ల మల్లయ్య ఇతర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు మందమర్రి పోలీసుల అవగాహన సదస్సు



**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం ఆగస్టు 6** మంచిర్యాల జిల్లా, మందమర్రి నేటి సమాచార సాంకేతిక యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు మందమర్రి పోలీసులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా, మందమర్రి ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు సైబర్ క్రైమ్ సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ,సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని డబ్బులు పోగొట్టుకున్నప్పుడు వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలా ఫిర్యాదు చేస్తే, బాధితుల ఖాతా నుండి బదిలీ అయిన నిధులు ఏ ఖాతాలోకి వెళ్లాయో గుర్తించి,ఆ ఖాతాలను వెంటనే స్తంభింపజేస్తారని తెలిపారు. ఒక చిన్న ఫిర్యాదు ద్వారా రూ. 100 నుండి రూ. కోటి వరకు సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లిన అన్ని నిధులను స్తంభింపజేయవచ్చని వివరించారు. బ్యాంక్ ఖాతాదారులందరూ అప్రమత్తంగా ఉండాలని,కస్టమర్ కేర్ పేరుతో ఎవరైనా ఓటీపీ ( ఓటిపి)అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వొద్దని ఆయన హెచ్చరించారు. బ్యాంక్ సిబ్బంది ఎవరూ ఓటీపీ అడగరని,అలా అడుగుతున్నారంటే అది మోసమేనని అర్థం చేసుకోవాలని చెప్పారు. సైబర్ స్మార్ట్‌గా వ్యవహరిస్తూ, ఓటీపీ అడుగుతున్న వారిపై 1930కి ఫిర్యాదు చేయాలని కోరారు. సోషల్ మీడియాలో, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో జాగ్రత్తగా ఉండాలని,లేకపోతే నగదు పోగొట్టుకునే ప్రమాదం ఉందని ఎస్సై రాజశేఖర్ విద్యార్థులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్సై శ్రీనివాస్,ఏఎస్ఐ మిలన్ బ్లూ కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించడం ద్వారా యువతను, ప్రజలను సురక్షితంగా ఉంచడానికి మందమర్రి పోలీసులు చేస్తున్న ఈ కృషికి అందరి నుండి ప్రశంసలు అందుతున్నాయి.

## మంథని రెనె హాస్పిటల్ లో నేటినుంచి పిడియాట్రిక్ సేవలు

**– ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు, రేనే హాస్పిటల్ చైర్మన్ డా. బంగారి స్వామి వెల్లడి**

**అగ్నిధార న్యూస్ మంథని :** మంథనిలోని రెనె హాస్పిటల్ నందు నేటి నుండి ప్రముఖ పీడియాట్రిక్ వైద్యులు డా. సత్యంబాబు ఎంబిబిఎస్, డిసిహెచ్ (సత్యంబాబు హాస్పిటల్, గోదావరిఖని చే) ప్రతి మంగళవారం,గురువారం ఉదయం 9:00 గంటల నుండి 11:30 గంటల వరకు వైద్య సేవలు అందించనున్నట్లు రెనె హాస్పిటల్ చైర్మన్ డా. బంగారి స్వామి తెలిపారు. మంథని చుట్టుపక్కల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.

**ప్రస్తుతం రెనె హాస్పిటల్‌లోని సేవలు:**

జనరల్ ఫిజిషియన్ ద్వారా 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని,ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు ప్రతి నెల రెండు సార్లు సేవలు అందించనున్నరాని తెలిపారు. చిన్నపిల్లల వైద్య సేవల కొరకు పీడియాట్రిక్ విభాగాన్ని ప్రారంభించనున్నామని ఆరోగ్యమే మహాభాగ్యం అనే దృష్టితో, మంథని ప్రాంతానికి చెందిన ప్రజలందరికీ అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తునట్లువారు తెలిపారు.

# దమ్ముంటే...కాంగ్రెస్ పార్టీ బీసీని ప్రధానిగా ప్రకటించాలి

## తెలంగాణ ముఖ్యమంత్రి ఢిల్లీలో డ్రామా
## బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదు
## 42శాతం రిజర్వేషన్లకు పూర్తి మద్దతునిస్తాం
## రాష్ట్రంలో యూరియా కొరత లేదు
### బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు



**అగ్ని ధార న్యూస్,( రామగుండం) :** కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే బీసీని ప్రధానిగా ప్రకటించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు సవాల్ విసిరారు.బుధవారం గోదావరిఖని లోని బిజెపి నాయకులు బల్మూరి అమరేందర్ రావు నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ ముఖ్యమంత్రి ధర్నా పేరు తో ఢిల్లీలో బీసీ రిజర్వేషన్లపై డ్రామాలు చేస్తున్నారని ఆక్షేపించారు.బీసీ బిల్లును,ఆర్డినెన్స్ తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని ఇపుడు బిజెపి అడ్డుపడుతుందని అబాండాలు మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.42 శాతం లో 10శాతం ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్డినెన్స్ తెచ్చే ముందు 10శాతం ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తామని ఎందుకు చెప్పలేదని రామచందర్ రావు ప్రశ్నించారు.ఆర్టికల్ 54,64 ప్రకారం ముస్లింలకు విద్యా ఉద్యోగాలలో 10 శాతం రిజర్వేషన్లు కల్పించవచ్చునని రాజకీయంగా మాత్రం రిజర్వేషన్లు లేవని గుర్తు చేశారు. హైదరాబాద్ ఎన్నికలలో 50 శాతంలో 35శాతం ఎంఐఎం పార్టీకి సీట్లు కేటాయించడంలో ఆంతర్యం అని ప్రశ్నించారు. 1956 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో బీసీ ముఖ్యమంత్రి చేయని హస్తం పార్టీ ఇప్పుడు బీసీ రిజర్వేషన్ పేరుతో కొత్తరాగం పాడుతుందని ఎద్దేవా చేశారు. పలు సందర్భాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ ఇవ్వకుంటే మాట్లాడని ముఖ్యమంత్రి ఇప్పుడు ప్రధానమంత్రి ఇవ్వడం లేదని మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. దేశంలో,రాష్ట్రంలో యూరియా కొరత లేదని,ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ తమ పార్టీని బదనాం చేయడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. యూరియా కొరత ఉందని ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.విలేకరుల ఈ సమావేశంలో పార్టీ నాయకులు కర్ర సంజీవరెడ్డి,కాసిపేట లింగయ్య,ఎస్.కుమార్,బల్మూరి వనిత అమరేందర్ రావు కందుల సంధ్యారాణి,సోమారపు లావణ్య వెంకటేష్ నేత,సుల్వ లక్ష్మి నర్సయ్య,రావు రాజేందర్,మహా వాది రామన్న జక్కుల నరహరి,కోమల్ల మహేష్ పాల్గొన్నారు.

## తెలంగాణ చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే వ్యక్తి ఆచార్య జయశంకర్

– ఆర్.జి శ్రీ జయం



**అగ్నిధార న్యూస్ రామగిరి :** సుమారు నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల గుండెల్లో ఎప్పటికీ గుర్తు ఉండిపోయే వ్యక్తి తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని రామగుండం–3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అన్నారు.బుధవారం జిఎం కార్యాలయం నందు నిర్వహించిన స్వర్గీయ ఆచార్య శ్రీ కొత్తపల్లి జయశంకర్ 91వ జయంతి వేడుకలలో భాగంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....స్వర్గీయ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ తెలంగాణ ఉద్యమం కోసం తన జీవితాన్ని అంకితం చేసి, ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారని, ఆలీగఢ్ విశ్వవిద్యాలయాల్లో ఆర్థిక శాస్త్రంలో విద్యనభ్యసించి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పీహెచ్డీ పొందారని, కాకతీయ విశ్వవిద్యాలయం లో ప్రొఫెసర్, ప్రిన్సిపాల్, వైస్ ఛాన్స్ లర్ గా ఉన్నత పదవులను నిర్వహించారని, విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై పోరాడుతూ 1952 లో నాన్– ముల్కీ ఉద్యమంలో పాల్గొని, 1954లో విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మొదటి ఎస్ఆర్సి కమిషన్ ముందు తెలంగాణ గలాన్ని వినిపించారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరం పై అనేక పుస్తకాలను రచించారని, తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన ఆచంచలమైన కృషి, దృఢ సంకల్పం రాష్ట్ర చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, ఏరియా ఇంజినీర్ వై.వి.శేఖరబాబు, ఎస్వోటుజియం యం.రామ్మోహన్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ప్రసాద రావు, విభాగతిపతులు కె.చంద్రశేఖర్, బి.సుదర్శనం, జనార్ధనరెడ్డి , రాజేంద్ర కుమార్, సి.జె.సురేఖ, షబీరుద్దీన్, ఇ.నాగేశ్వరరావు తో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించాలి

### వారి స్ఫూర్తితో నేటి ప్రజలు, యువత ముందుకు సాగాలి
### రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు మల్లన్న.
### సమతా సైనిక్ దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్.



**అగ్నిధార,(రామగుండం):** తెలంగాణ భావజాలవ్యాప్తికే తన జీవితాన్ని ధారబోసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని ,భూమి, పేదలకు భూమి బుక్తి, విముక్తికి తన పాటను తూటాగా మార్చి పోరాడిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు మల్లన్న, సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు సమతా ఫౌండేషన్ చైర్మన్ మార్షల్ దుర్గం నగేష్ లు అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి, ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధ వర్ధంతిలను పురస్కరించుకుని సమతా సైనిక దళ్ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాలర్పించారు. అనంతరం మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా, ఉద్యమమే ఊపిరిగా జీవిస్తూ, తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను సాకారం చేసేందుకు కడదాక పోరాడిన ఉద్యమకారుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతున్న నేటి తరుణంలో తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడటానికి జయశంకర్ సార్ ఉద్యమ స్ఫూర్తిని, సిద్ధాంతాలను భావితరాలకు అందించాల్సిన ఆవశ్యకత ఇప్పుడు ఎంతగానో ఉందన్నారు. 'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా.. పోరు తెలంగాణమా' అంటూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువు పట్టుగా నిలిచిన వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. పేద కుటుంబంలో పుట్టి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన గద్దర్ ఉ న్నత కొలువులవైపు దృష్టిసారించకుం డా ప్రతి ఒకరికీ కూడు, గూడు, నీడ లభించాలనే లక్ష్యంతో జీవితాంతం తన పాటలతో ప్రజలను చైతన్య పర్చారని పేరొన్నారు. ప్రత్యేక తెలంగాణ కొరకు పలు ఉద్యమ సంస్థల ఏర్పాటుతో తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరులూదిన వారిలో అగ్రగణ్యుడు గద్దర్ అని గుర్తుచేశారు. నేటి యువత మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమత గ్రంథాలయ నిర్వాహకురాలు దుర్గం ప్రమీలనగేష్, సమతా సైనిక దళ్ నాయకులు చీమల ఆనంద్, గూడూరు లవన్ కుమార్, గన్న మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది

### బీజేపీ నేత తల్లోజు ఆచారి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను 6 గ్యారంటీ లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ ఇబ్రాహీం బుధవారం బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు ఆచారి స్థానిక నాయకులు వినతి పత్రం అందజేశారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి పెద్ద ఎత్తున బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలతో ర్యాలీగా శివాజీ చౌక్ లో ఏర్పాటు చేసిన సభలో బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు ఆచారి మాట్లాడుతూ అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా ఇచ్చిన హామీలు రైతులకు రైతు బంధు 15 వేలు, వృద్దులకు 4 వేల పెన్షన్, వికలాంగుల కు 6 పెన్షన్, యువతకు నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ వివాహానికి తులం బంగారం ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి మాట తప్పిన కాంగ్రెస్ పార్టీ కి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక ఎన్నికల్లో తగిన విధంగా బుద్ధి చెబుతామని అన్నారు.బిజెపి నాయకులు, మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, నాయకులు దుర్గాప్రసాద్, రాఘవేందర్ గౌడ్,శేఖర్ రెడ్డి,బోడ నరసింహ, పట్టణ అధ్యక్షుడు బాబీ దేవ్, మండల అధ్యక్షుడు నరేష్ గౌడ్, రాం భూపాల్ రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్యామ్ , గుండోజు గంగాధర్, వివేకానంద, నరేష్ గౌడ్ , సురేందర్ గౌడ్, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన మార్చాల విద్యార్థి




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన అభిలాష్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానో పాధ్యాయులు సిహెచ్ వెంకటరమణ, ఫిజికల్ డైరెక్టర్ యాదయ్య గౌడ్ తెలిపారు. ఈనెల 7వ తేదీన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు జనగామ జిల్లాలో జరగనున్నాయి. మార్చాల జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి అభిలాష్ ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి పట్టణంలోని వై ఆర్ ఎం జూనియర్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ జాతిపిత, తెలంగాణ మార్గదర్శకుడు ఆచార్య జయశంకర్ సార్ జయంతి వేడుకల్ నీ కళాశాల ప్రిన్సిపాల్ సదానందం గౌడు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సందర్భంగా జయశంకర్ సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సదానందం గౌడు మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్త , మూడు తరాల తెలంగాణ ఉద్యమానికి మూల విరాట్ ,తెలంగాణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన తెలంగాణ జాతి గర్వించదగ్గ గొప్ప వ్యక్తి జయశంకర్ సార్ అని పేర్కొన్నారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజనీతి శాస్త్ర ఉప న్యాసకులు పాయిళ్ళ గోపాల్ మాట్లాడుతూ 1952 ముల్కీ ఉద్యమంలో, 1969 తెలంగాణ విద్యార్థి ఉద్యమంలో ,2009 మలిదశ తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ సార్ యొక్క పాత్ర ,దిశ నిర్దేశం తెలంగాణ సమాజం ఎన్నటికీ మర్చిపోలేనిదన్నారు. భారతదేశంలో 37 రాజకీయ పార్టీలను తెలంగాణ రాష్ట్రం కోసము ఏకం చేసిన మహనీయుడు జయశంకర్ సార్ అని కొనియాడారు.ఈ సందర్భంగా సీనియర్ లెక్చరర్ గోపాల్ ని లెక్చరర్స్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రభాకర్ గౌడు యాదయ్య సార్, నవీన్ వంశీ,బాల్ రాజ్ రామకృష్ణ శ్రీనివాస్, ఇదమయ్య,శ్రీశైలం గౌడు, ఉస్సేన్ ,భాగ్యలక్ష్మి, శబానా బేగం వెంకటయ్య, శరత్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రమాదకంగా మారిన కొట్ర బీటీ రోడ్డు

### అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలి.



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండల పరిధిలోని కోట్ర, గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది గతంలో కురిసిన వర్షాల కారణంగా ఇరు వైపులా కోతకు గురై భారీగా గుంతలు ఏర్పడ్డాయి వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్న ప్రమాదాల బారిన పడటం కాయంగా కనిపిస్తుంది రోడ్డు కోతలకు గురై నెలలు కావస్తున్న అధికారులు మరమ్మతులు ఏ మాత్రం చేపట్టడం లేదు దీంతో ప్రయాణికులు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతకు గురైన మరమ్మతు లు చేపట్టాలని వాహనదారులు కోరుకుంటున్నారు.

## మృతుని కుటుంబనికి ఆర్థిక సహాయం అందజేత

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం జంగారెడ్డిపల్లి గ్రామంలో ఉప్పు యాదయ్య అనారోగ్యంతో మరణించడం మరణించడం జరిగింది ఈ విషయాన్ని జంగారెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీ ద్వారా తెలుసుకొన్న తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి మృతుని కుటుంబానికి సానుభూతి తెలుపుతూ 3000 రూపాయలు కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో, చంద్రా రెడ్డి, యాదయ్య, వాటం రాములు, మధుసూదన్ రెడ్డి, గడిగే రాజు, దాసు, పాల్గొనడం జరిగింది.

## ఈసీ మొట్ట మొదట రద్దు చేయాల్సింది బీఆర్ఎస్ పార్టీనే

### హామీలు అమలు చేయకుండా కాలయాపన చేసింది కె సి ఆర్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి ఢిల్లీలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయని పార్టీల గుర్తింపును రద్దు చేయాలని కేటీఆర్ ఈసీని కలవడంపై.నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ ఈ అంశంపై చర్యలు తీసుకుంటే. మొట్ట మొదట రద్దు చేయాల్సింది బీఆర్ఎస్ గుర్తింపునేనని స్పష్టం చేశారు. రైతు రుణమాఫీ, నీళ్లు, నిధులు, నియామకాలు, యువతకు ఉద్యోగాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, కేజీ టు పీజీ విద్య, దళితులకు మూడెకరాల భూమి. ఇలా ఎన్నో హామీలను బీఆర్ఎస్ అమలు చేయలేదని ధ్వజమెత్తారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం. కానీ. ఇది ఒక్క బీఆర్ఎస్ పార్టీకి కనిపించడం లేదు. రూ.10 లక్షల బీమా, మహిళలకు ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇళ్లు, 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ, రైతు భరోసా రూ.12 వేలు, ఒకటిన్నర ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. ఇంకా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను కూడా త్వరలో భర్తీ చేస్తాం. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు, సోలార్ కరెంట్ ప్రాజెక్టులు ఇస్తున్నాం. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని మా ముఖ్యమంత్రి చెబుతున్నారు. 90 శాతం హామీలు అమలు చేశాం. ఇలాంటి పార్టీపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ పార్టీకి లేదు' అని మల్లు రవి అన్నారు.

# ప్రజలలో నమ్మకం కలిగించాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**
**సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ కార్యాచరణ.**
**ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓపి సేవలు నిర్విరామంగా జరగాలి.**
**వైద్య ఆరోగ్య శాఖ పని తీరు పై సమీక్ష.**



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. టీబీ ముక్త్ భారత్, సీజనల్ వ్యాధుల నియంత్రణ అంశాల పై చర్చించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ పరిధిలో లక్ష్యాలను నిర్దేశించుకొని లక్షణాలు గల ప్రతి ఒక్కరికీ నిర్ధారణ పరీక్షల నిర్వహించాలని అన్నారు. ప్రతి ఫ్రై డే డ్రై డే కార్యక్రమం పక్కాగా జరగాలని అన్నారు. తక్కువ ఇండ్లు కవర్ చేసినా నాణ్యతతో చేయాలని, నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని అన్నారు. సీజనల్ వ్యాధులు నియంత్రణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ పేషంట్ వచ్చే రోగులకు వ్యాధి లక్షణాలు ఉంటే తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ డెంగ్యూ, మల్లేరియా కేసు వచ్చినా పరిసర ప్రాంతాల్లోని 50 ఇండ్లకు ఫీవర్ సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. 102 వాహనాల ద్వారా గర్భిణీ మహిళలకు సకాలంలో చెక్ అప్ జరిగేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న యంత్రాల మరమ్మత్తులు ఆగస్టు నెలాఖరు వరకు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆగస్టు 11న జరిగే నులి పురుగుల నివారణ మందుల పంపిణీ కట్టుదిట్టంగా జరగాలని, 19 సంవత్సరాల వయసు లోపు పిల్లలకు మందులు పంపిణీ చేయాలని, ఆ రోజు మిస్ అయిన పిల్లలకు ఆగస్టు 18న తప్పనిసరిగా మందు అందేలా చూడాలని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో అధికంగా సీజేరియన్ ఆపరేషన్లు జరుగుతున్నాయని, వీటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మొదటి కాన్పు మహిళలకు మొదటి నుంచి సాధారణ ప్రసవాలు వైపు ప్రోత్సాహించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు అధికంగా జరిగేలా చూడాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సబ్ సెంటర్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో ఎక్కువ గా ఆరోగ్య శ్రీ ఆపరేషన్ లు నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సమయపాలన పాటించాలని, ఔట్ పేషెంట్ సేవలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట తప్పని సరిగా జరగాలని అన్నారు. జనరల్ మెడిసిన్ విభాగంలో పని తీరు మెరుగ్గా ఉండాలని అన్నారు. రోగులు, కుటుంబ సభ్యులతో వైద్యులు సిబ్బంది మర్యాదతో ప్రవర్తించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పని తీరు చాలా బాగుందని, ఇంకా మెరుగైన సేవలు అందించే సామర్థ్యం మన దగ్గర ఉందని ఆ దిశగా అధికారులు పని చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ 91 వ జయంతి



**అగ్నిధార న్యూస్మహమ్మదాబాద్ /గండీడ్:** ఈరోజు మహబూబ్నగర్ జిల్లా గండీడ్ మండలం చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు అంగడి అరుణ దేవి మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆగస్టు 6 1934 సంవత్సరం హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేటలో లక్ష్మీకాంతరావు మహాలక్ష్మి దంపతులకు జన్మించాడు తెలుగు ఉర్దూ హిందీ ఇంగ్లీష్ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారు ఆర్థిక శాస్త్రంలో పిహెచ్డి పట్టా పొంది ప్రిన్సిపాల్ గారి రిజిస్టర్ గా పనిచేసి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్గా ఉన్నత పదవులు పొందారు 1969 తెలంగాణ ఉద్యమంలో అంతకుముందు నాన్ ముల్కి ఉద్యమంలో సాంబార్ ఇడ్లీ గో బ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై ఎన్నో పుస్తకాలు రాశాడు జయశంకర్ తన జీవితాన్ని ఆస్తిని తెలంగాణ కోసం అంకితం చేశాడు ఇప్పుడైతే నాకు ఒకే కోరిక మిగిలింది తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కల్లారా చూడాలి తర్వాత మరణించాలి అనేవాడు తెలంగాణకు జరుగుతున్న అన్యాయాల పట్ల అసమానతుల పట్ల తీవ్రంగా పోరాటం చేశాడు కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంగడి అరుణ దేవి, ఉపాధ్యాయులు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, బి.మల్లేష్, కె. వెంకటయ్య, కె. సికిందర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## నలకదొడ్డి. దేవనబండ గ్రామాలలో పొలం పిలుస్తుంది



**కర్నూలు :** నలకదొడ్డి దేవనబండ గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగినది ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గడువు ఆగస్టు 14 వరకు ఇవ్వడం జరిగింది రైతు సోదరులు పంటల బీమా ఇన్సూరెన్స్ చేసుకోవాల్సింది గా తెలియజేయడమైనది అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో సాగుచేసిన పంటలను ప్రతి రైతు తప్పనిసరి పంట నమోదు చేసుకోవాలి మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉన్నది కావున అందరూ రైతులు కావలసినవారు ఉపయోగించవలసిందిగా కోరడమైనది అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాలలో రైతులు పత్తి కంది ఆముదం వేరుశనగ జొన్న సజ్జ రాగి కుర్ర ఉల్లి టమాట మొదలగు పంటలను సాగు చేయడం జరిగినది పత్తి పంట పొలాల లో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పత్తి పంటలో గులాబీ రంగు పురుగు మరియు పచ్చ దోమ తెల్ల దోమ మొదలగు రసం పీల్చే పురుగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉన్నందున రైతులు ఎకరానికి పసుపు నీలిరంగు బట్టలను అజయ్ 20 నుంచి 30 అమర్చుకోవాలి దీనివలన పురుగు ఉధృతి తగ్గించుకోవచ్చును లేదా పత్తి పంటలో ఎకరంనకు 8 నుంచి 10 లింగాకర్షణ బుట్టలను అమర్చుకోవాలిపత్తి పంటలో పచ్చ దోమ రెక్కలతో పిల్ల దోమ రెక్కలు లేకుండా ఆకుపచ్చ రంగులో ఉంటాయి పెద్ద దోమ ముందు రెక్కలు నల్లటి మచ్చగా ఉంటుంది పెద్ద దోమలు అడ్డంగా నడుస్తూ ఆకుల అడుగుభాగాన చేరి రసాన్ని పిలుస్తూ ఉంటున్నాయి ఇవి ఆశించిన మొక్కల ఆకులు చివర పసుపు పచ్చగా మారి క్రమేపి ఎర్రగబడి చివరకు ఆకులు ముడుచుకుపోతాయని చెప్పడం జరిగింది పచ్చ దోమ ఎక్కువైతే పైరులు పెరుగుదల క్షీణించి మొక్కలు రాక దిగుబడి తగ్గుతుంది దీని నివారణకి ఆస్పెట్ 1.5 గ్రాములు లేదా ఇమిడా క్లోత్రేడ్ 0.3 గ్రాములు లేదా టయామితాక్సిన్ 0.3 గ్రాములు లేదా ఫ్లోనికామైడ్ 0.3 గ్రాములు లేదా పెన్యంతురాన్ 1.25 గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి.

# జయశంకర్ కలను నిజం చేసిన కాంగ్రెస్ పార్టీ

**మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్,**
**మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ అన్వర్**



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిరకాలపు కలయిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనను కాంగ్రెస్ పార్టీ సాకారం చేసిందని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ అన్వర్ లు అన్నారు. తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా బుధవారం కమాన్ పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ అన్వర్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లే రామ్మూర్తి, మల్యాల తిరుపతి, దాసరి గట్టయ్య, అబ్దుల్ రఫీక్, బొంపల్లి రాజయ్య, బొల్లపల్లి శంకర్ గౌడ్, కిషన్ రెడ్డి, అనవేన లక్ష్మీరాజం, పిల్లి శేఖర్, కుక్క రవి, గడ్డం బాపు, ఎరుకల బాబురావు, తీగల సమ్మయ్య, బోనాల సత్యం, రామస్వామి, గెల్లి లింగయ్య, చాట్ల గట్టయ్య, మల్యాల మహేష్, రఫిక్ సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో.. పెంచికల్ పేట్ రహదారి పనులు ప్రారంభం..!

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** కమాన్ పూర్ మండల కేంద్రంలోని శ్రీపాదరావు విగ్రహం నుండి పెంచికల్ పేట్ జంక్షన్ ( గ్రామ పంచాయతీ కి వెళ్లి రహదారి మూలమలుపు) వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పనులు మరికొద్ది రోజుల్లో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఇటీవల ఆ రహదారి నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థ కు చెందిన వారితో పాటు ఇంజనీర్ రహదారిని పరిశీలించారు. ఈ రహదారి నిర్మాణానికి రూ, 4 కోట్ల 5 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇప్పుడు ఈ రహదారి నిర్మాణంలో థార్ రోడ్డుతో పాటు సిమెంట్ బిట్ రోడ్లు కొన్ని చోట్ల వేయాల్సి ఉంది. ఈ క్రమంలో ఇప్పట్లో సిమెంట్ రోడ్డు పనులు నిర్వహించడం పూర్తి చేసినంకా వర్షాలు తగ్గాక థార్ రోడ్డు పనులు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరుయై నెలలు గడుస్తున్న ఇంకా పనులు చేపట్టడం లేదని పీ. ఏ. సీ. ఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లగా.. ఆ కాంట్రాక్టర్ తో ఫోన్ లో మాట్లాడి త్వరిత గతిన పనులు ప్రారంభించి పూర్తి చేయాలని సూచించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఆ కాంట్రాక్ట్ సంస్థ త్వరలోనే పనులు చేపట్టెందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

## వైభవంగా ఆదివరాహస్వామి కల్యాణం

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** కమాన్ పూర్ మండల కేంద్రంలోని ప్రసిద్ధి స్వయంభూ ఆదివరాహస్వామి క్షేత్రంలో స్వామివారి జయంతి ఉత్సవాలలో భాగంగా భూదేవి, శ్రీదేవిలతో స్వామివారికి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సాంప్రదాయ పద్ధతిలో కల్యాణ వేడుక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం సందడిగా మారింది. అడిషనల్ కలెక్టర్ వేణుతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకున్నారు.

## బంధువుల మని చెప్పి బంగారం దొంగతనం

**దంపతులు ఇద్దరి అరెస్ట్.**
**ఎస్ఐ కురుమూర్తి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం లోని వెల్జాల్ గ్రామానికి చెందిన రాచమల్ల మల్లమ్మ గత వారం రోజుల క్రితం మధ్యాహ్నం సాయిబాబా గుడి దగ్గర బెంజ్ పై కూర్చుని ఉండగా, ఆమె దగ్గరికి ఇద్దరు భార్య భర్తలు వచ్చి మాది ఆవంచ గ్రామం మీకు చుట్టాలము అవుతాము అని వృద్ధురాలికి మాయమాటలు చెప్తారు. ఆమె మెడలో ఉన్న తొమ్మిది గ్రాముల బంగారు గుడ్ల హారం తీసుకొని పుస్తెల తాడు చేతిలో పెట్టి నమ్మించి అక్కడి నుండి వెళ్ళి పోయారు. ఆమె మనవడికి చూపించగా అది నకిలీ అని బంగారం అని తెలిసిన తర్వాత ఈ ఘటనతో వృద్ధురాలు కన్నీటి పర్యంతమయ్యింది. దాంతో స్థానిక పోలీస్?స్టేషన్?లో ఫిర్యాదు చేయగా ఎస్సై ఆదేశాల మేరకు క్రైమ్ కానిస్టేబుల్ బి. జాషువా, సంఘటన స్థలానికి చేరుకొని అక్కడ ఉన్న ప్రతి ఒక్క సీసీ కెమెరాలను పరిశీలించగా నిందితులు మిడ్జిల్ లో ఒక బంగారు షాపులో వాటిని అమ్మి డబ్బులు తీసుకొని వెళ్లారు. అని దాంతో బంగారు గుడ్ల హారం ని స్వాధీన పరుచుకుని నిందితుల గురించి వెతుకుతుండగా శంషాబాద్ సిసిఎస్ పోలీసుల సహాయంతో దొంగలను పట్టు కున్నారు.నిందితులని అదుపులోకి తీసుకొని విచారించగా ఇద్దరు భార్యాభర్తలు అని ఎరుకలి శ్రీను,ఎరుకలి అరుణ గా గుర్తించారు. వీరిద్దరిపై కూడా గతంలో దొంగతనం కేసులు ఉన్నాయి. నిందితులను రిమాండ్‌కు తరలించారు. బంగారు గుడ్ల హారంని త్వరగా రికవరీ చేసినందుకు క్రైమ్ కానిస్టేబుల్ జాషువాని ఎస్సై మరియు గ్రామస్తులు అభినందించారు.

## యువత రాజకీయాల్లో రాణించాలి

**రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** చట్టసభల్లో బలమైన చర్చలు జరగాలంటే యువత రాజకీయాల్లోకి రావాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. ఆమనగల్లు బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు,మున్సిపల్ కార్యదర్శి వద్దేమోని శివకుమార్ జన్మదిన వేడుకలు సందర్భంగా హైదరాబాద్ లోని ఆయన నివాసంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ రాజకీయాల్లో పాతంతరం అంతరించిపోయిందని మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో యువత రాజకీయాల్లోకి రావాలని సూచించారు. ఈ వేడుకలలో సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి, ఆమనగల్లు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూరమల్ల సుభాష్, తలకొండపల్లి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా యుద్ధ నౌక గద్దర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు గద్దర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళి అర్పించి వారు మాట్లాడారు. అర్ధ శతాబ్దంగా పిడిత ప్రజల కోసం ప్రాణం పోయిన పర్వాలేదు పాట మాత్రం మానని వెన్నులో తుపాకీ తూట ఇముడ్చుకోని గోసి,గొంగడేసి కాళ్ళకు గజ్జేకట్టి గంతులేసి గానం చేస్తూ పాటై, మాటై, ఆటై ,తెలంగాణ జానపద యోధుడై, సాంస్కృతిక వారధై విప్లవమే తన నినాదమై కొనసాగినఅత్యంత ప్రతిభావంతమైన కవి , గాయకుడు గద్దర్ వర్ధంతి విప్లవ జోహార్లు అంటూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిసి సబ్ ప్లాన్ తాలూకా అధ్యక్షుడు మేకల రాజేందర్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యులు గుమ్మకొండ రాములు, బీసీ సబ్ ప్లాన్ నాయకుడు సదానందం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితం అంకితం చేసిన మహనీయుడు జయశంకర్

**మాజీ మంత్రినిరంజన్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితం అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ 94వ జయంతి సందర్భంగా బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జయశంకర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ,"నాటి విద్యార్థిగా ముల్కీ ఉద్యమంలో పాల్గొన్న జయశంకర్ సార్, 1969 ఉద్యమంలో ఉద్యమపంతులుగా చలించిపోని పట్టుదలతో మూడు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రజలలో సజీవంగా ఉంచారు.ఆయన నిస్వార్థ, నిరాడంబర జీవితశైలి ఎంతో ఆదర్శప్రాయంగా నిలిచింది. మలిదశ తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతిక ఆధారంగా ఊపిరిలూదిన ఆచార్య జయశంకర్ తెలంగాణ జ్ఞానశిఖరంగా మారారు," అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తో పాటుగట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, రమేష్ గౌడ్, పరంజ్యోతి, గులాం ఖాదర్, రఘువర్ధన్ రెడ్డి, జాత్రు నాయక్, మాధవ రెడ్డి, నాగన్న యాదవ్, ఉంగ్లం తిరుమల్, రహీం, ఇమ్రాన్, నీల స్వామి, చిట్యాల రాము, జోహేబ్ హుస్సేన్, మురళి సాగర్, పెద్దముక్కుల రవి, ఏకే పాష, చిలుక సత్యం సాగర్, బాల్ రాజు, హరి బ్రదర్స్, గాలిగల్ల క్రాంతి, ఖాదర్, ఎండి మహబూబ్, నాగరాజు, ముని కుమార్, మోహన్ చారి, శివ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, లోకాజి రావు, నరేష్, చందు నాయక్, తోట శీను, వెంకటయ్య, నరసింహ, చాణిక్య, ప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# అనుష్క శెట్టి 'ఘాటి'.. ట్రైలర్ వచ్చేసింది!

అనుష్క శెట్టి లీడ్ రోల్‌లో నటిస్తోన్న తాజా చిత్రం ఘాటి. ఈ సినిమాలో విక్రమ్ ప్రభు మరో కీలక పాత్రలో నటించారు. జాగర్లమూడి రాధాకృష్ణ (క్రిష్) దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీని యూవీ క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. తాజాగా విడుదలైన ఘాటి ట్రైలర్ చూస్తే గంజాయి నేపథ్యంలో ఈ కథను తెరకెక్కించినట్లు తెలుస్తోంది. 'ఘాట్లలో గాటీలు ఉంటారు సార్' అనే డైలాగ్‌లో ట్రైలర్‌ను ప్రారంభించారు. ట్రైలర్ చూస్తే అనుష్క మరోసారి అరుంధతి తరహాలో రౌద్రంగా కనిపించింది. ట్రైలర్ చివర్లో 'సీతమ్మోరు లంక దహనం చేస్తే ఎట్టుంటదో చూద్దురు గానీ' అనే డైలాగ్ ఈ సినిమాపై అంచనాలు పెంచేసింది. కాగా.. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 5న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రటించారు. ఇప్పటికే పలుసార్లు వాయిదా పడిన ఈ సినిమా వచ్చేనెలలో థియేటర్లలో సందడి చేయనుంది. ఈ మూవీని తెలుగు, తమిళ, హిందీ, మలయాళం భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయనున్నారు. ఈ సినిమాకు నాగవెల్లి విద్యాసాగర్ సంగీతమందిస్తున్నారు.

# సోషల్ మీడియాను షేక్ చేస్తున్న నికితా దత్త



# నేను ప్రమోట్ చేసింది గేమింగ్ యాప్స్ మాత్రమే



బెట్టింగ్ యాప్ కేసు విచారణలో భాగంగా అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ నేడు హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఉన్న ఈడీ కార్యలయం ముందుకు హాజరైన విషయం తెలిసిందే. తాజాగా ఈ విచారణ ముగిసింది. బెట్టింగ్ యాప్స్‌పై ప్రచారం కేసులో దాదాపు నాలుగున్నర గంటలపాటు విచారణ జరుగగా.. ఈ యాప్స్‌లో ప్రమోషన్స్‌లో మనీలాండరింగ్ జరిగిందనే కోణంలో ఈడీ విజయ్‌ను విచారించినట్లు సమాచారం. అయితే ఈ విచారణ అనంతరం విజయ్ దేవరకొండ మీడియా ముందుకు వచ్చి మాట్లాడాడు. బెట్టింగ్ యాప్ కేసులో నా పేరు రావడంతో విచారణకు పిలిచారు. నేను ప్రమోట్ చేసింది గేమింగ్ యాప్స్ మాత్రమే. గేమింగ్ యాప్‌కి, బెట్టింగ్ యాప్‌కి అసలు సంబంధమే లేదు. రెండు వేరు వేరు. గేమింగ్స్ యాప్స్ అనేవి కంప్లీట్‌గా లీగల్. సుప్రీం కోర్టుచే గుర్తించబడినవి. ఇవి టాక్స్ కడతాయి. జీఎస్టీ ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఉంటాయి. నా బ్యాంకు లావాదేవీల వివరాలన్నీ ఈడీకి సమర్పించా. నేను ప్రమోట్ చేసిన %ూ%23 యాప్ తెలంగాణలో ఓపెన్ కాదు. నేను లీగల్ గేమింగ్ యాప్‌ను మాత్రమే ప్రమోట్ చేశా. దానికి సంబంధించిన ఒప్పందం వివరాలన్నీ ఈడీకి సమర్పించాను అంటూ విజయ్ చెప్పుకోచ్చాడు. మరోవైపు ఈ కేసులో ఇప్పటికే ప్రకాష్ రాజ్‌ని ఈడీ విచారించగా, రానా దగ్గుబాటి, మంచు లక్ష్మిలకు కూడా నోటీసులు జారీ చేసింది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).

# 'వార్2' నుంచి పార్టీ సాంగ్ అప్‌డేట్

బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్, టాలీవుడ్ అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'వార్ 2'. యష్‌రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్యచోప్రా ఈ సినిమాకు నిర్మిస్తుండగా.. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఆగస్టు 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్ చేస్తుంది చిత్రయూనిట్. ఇదిలావుంటే తాజాగా మూవీ నుంచి క్రేజీ అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ సినిమాలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కలిసి డ్యాన్స్ చేసిన సలామ్ అనాలి అనే పాట అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ పాటకు సంబంధించిన అప్‌డేట్‌ను రేపు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.





# నాని అభిమానులు బీ రెడీ.. సర్‌ప్రైజ్ వచ్చేస్తోంది..!

నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం పీక్ స్టేజ్‌లో ఉన్నారు. వరుస విజయాలతో జోరుగా దూసుకెళ్తున్న నాని, క్రేజీ ప్రాజెక్టులను లైన్‌లో పెట్టుకుంటూ తన రేంజ్‌ను మరింత పెంచుకుంటున్నాడు. రీసెంట్‌గా హిట్-3 తో బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన నాని, ఇప్పటికే హ్యాట్రిక్ హిట్లను ఖాతాలో వేసుకున్నాడు. దసరా తో మాస్ ఆడియన్స్‌ను ఆకట్టుకున్న నాని, తర్వాత హాయ్ నాన్న తో ఫ్యామిలీ ఆడియన్స్‌ను మెప్పించాడు. ఆ వెంటనే వచ్చిన సరిపోదా శనివారం తో మరో సక్సెస్‌ను అందుకున్నాడు. ఇప్పుడు హిట్-3 తో వరుసగా నాలుగో విజయం సాధిస్తూ తన సత్తా చాటాడు. ప్రస్తుతం ప్యారడైజ్ అనే భారీ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నాడు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా, నాని కెరీర్‌లోనే హైయెస్ట్ బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. 2026 మార్చి 26న విడుదలకు సిద్ధమవుతున్న ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా, హైదరాబాద్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతోంది. ఇప్పటికే లీక్ అయిన నాని లుక్‌కి ప్రేక్షకుల నుంచి భారీ స్పందన వస్తోంది. ఈ సినిమాతో మరో హిట్ ఖాయమనే అంచనాలు నెలకొన్నాయి. టాలీవుడ్ టైర్-2 హీరోలలో నాని ఇప్పుడు ప్రత్యేకంగా నిలిచారు. బాక్సాఫీస్ వద్ద స్ట్రాంగ్ ఓపెనింగ్స్ సాధిస్తూ, వరుస హిట్స్‌తో తన మార్కెట్‌ను భారీగా పెంచుకున్నారు. ఓవర్సీస్ మార్కెట్‌లోనూ మిలియన్ డాలర్ క్లబ్‌ను పలుమార్లు తాకిన నాని, అక్కడ కూడా బలమైన ఫ్యాన్ బేస్‌ను ఏర్పాటు చేసుకున్నారు. నాని సినిమాలకు "మినిమమ్ గ్యారంటీ" అనే ట్యాగ్ ఏర్పడినట్టు అయ్యింది. ఈ స్థాయికి నాని చేరినదానికి ప్రధాన కారణం అతని స్క్రిప్ట్ సెలెక్షన్. భావోద్వేగాలకు పెద్దపీట వేసే కథలు, కంటెంట్‌తో పాటు కమర్షియల్ అంశాలను కూడా సమతుల్యం చేస్తూ సినిమాలను ఎంచుకుంటున్నాడు. శ్రీకాంత్ ఓదెలతో చేస్తున్న 'ది ప్యారడైజ్' పై అతిభారీ హైప్ క్రియేట్ అయింది. తాజాగా ఈ సినిమా నుంచి ఓ సడెన్ సర్‌ప్రైజ్ ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆగస్టు 8న రిలీజ్ చేస్తున్నట్లో ఓ కాన్సెప్ట్ పోస్టర్ ద్వారా మేకర్స్ తెలియజేశారు. తుపాకుల రాజ్యంలో నాని ఎలాంటి విస్ఫోటం సృష్టించి ఆ రాజ్యానికి మకుటం లేని మహారాజుగా ఎదుగుతాడా.. అనే విధంగా ఈ కాన్సెప్ట్ పోస్టర్‌ను మేకర్స్ తీర్చిదిద్దడం విశేషం.. ఈ చిత్రంలో రాఘవ్ జుయాల్, సోనాలీ కులకర్ణి తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com